# మన తొలివెలుగు

RNI: TGBIL/26/A2289

తెలుగు దినపత్రిక

www.manatolivelugu.in

CEO & Chief Editor : Vanga Nagaraj Reddy (Raju)

హైదరాబాద్ | బుధవారం 17 జూన్ 2026 | సంపుటి : 1 | సంచిక : 16 | పేజీలు : 8 | వెల : 2/-


## భారీగా లాభపడ్డ స్టాక్ మార్కెట్లు.. 544 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

భారతీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీగా లాభపడ్డాయి. వరుసగా మూడో సెషన్‌లోనూ లాభాలు పొందడం విశేషం. సెన్సెక్స్ 544 పాయింట్లు, నిఫ్టీ 135 పాయింట్లు లాభపడ్డాయి. హోర్ముజ్ జలసంధి తెరిచి ఉంచడం, ఇరాన్–అమెరికా మధ్య శాంతి ఒప్పందం మార్కెట్‌కు లాభాలు తెచ్చిపెట్టాయి. మంగళవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 544.15 పాయింట్లు లాభపడి 76,808.48 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ50 కూడా 135.25 పాయింట్లు లాభపడి, 23,989.15 పాయింట్ల వద్ద ముగిసింది. 24,000 మార్క్‌కు నిఫ్టీ దాదాపు 11 పాయింట్ల దూరంలో నిలిచిపోయింది. గత మూడు సెషన్లు కలిపి సెన్సెక్స్ 4 శాతం, నిఫ్టీ 3.6 శాతం లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ ధర 2.57 శాతం తగ్గింది. బ్యారెల్ క్రూడాయిల్ ధర 81.03 డాలర్ల వద్ద ట్రేడయింది. అలాగే, డబ్ల్యూటీఐ క్రూడాయిల్ ధర కూడా 2.71 శాతం తగ్గింది. బ్యారెల్ క్రూడాయిల్ ధర 78.56 డాలర్ల వద్ద కొనసాగింది. ఆసియా మార్కెట్లు కూడా మంగళవారం 0.8 శాతం లాభాలు పొందాయి. రూపాయి కూడా స్వల్పంగా లాభపడింది. డాలర్‌తో రూపాయి విలువ 94.6 వద్ద కొనసాగింది.

## హైదరాబాద్ మెట్రోపై మాకు వివక్ష లేదు



- రేవంత్ రెడ్డి అలా మాట్లాడటం సమంజసం కాదు
- రేవంత్ రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం
- దేశవ్యాప్తంగా మిగతా మెట్రోల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కేంద్ర సహకారం ఉంటుందని వెల్లడి
- కేంద్రానికి రేవంత్, కాంగ్రెస్ సర్టిఫికెట్ అవసరం లేదని ఎద్దేవా

**హైదరాబాద్**

గతంలో మెట్రో ఫేజ్–1కు కేంద్రం రూ.1250 కోట్లు ఇచ్చిందన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దేశవ్యాప్తంగా మిగతా మెట్రోల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కేంద్ర సహకారం ఉంటుందని తెలిపారు. సాంకేతిక, ఆర్థిక విషయాలు చర్చించి రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తే సాకారమవుతాయని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విమర్శల నేపథ్యంలో దిల్లీలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. తెలంగాణ కావున, కిషన్ రెడ్డి వద్దంటే ప్రాజెక్టులు ఎక్కడా ఆగవని, అనాలోచితంగా, దుందుడుకుగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం సమంజసం కాదని హితవు కిషన్ రెడ్డి పలికారు. తెలంగాణ అభివృద్ధి పట్ల తమకు చిత్తశుద్ధి ఉందని స్పష్టం చేశారు. మోదీకి, తనకు, కేంద్రానికి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ సర్టిఫికెట్ అవసరం లేదని ఎద్దేవా చేశారు. తాము రేవంత్ రెడ్డికి జవాబుదారీ కాదని, తెలంగాణ ప్రజలకు జవాబుదారీ అని వెల్లడించారు. తెలంగాణ అభివృద్ధి కోసం 12 ఏళ్లుగా - మిగతా3లో



## జవాబుదారీతనం అనే పరీక్షలో బీజేపీ ఫెయిల్

- ప్రధాన్ కచ్చితంగా రాజీనామా చేయాల్సిందే: ఖర్గే
- టెలిగ్రామ్‌ను బ్లాక్ చేయడం కాదు
- కోట్లాది మంది యువత భవిష్యత్తును బ్లాక్ చేసిన మంత్రిని తొలగించండి
- మోదీ ప్రభుత్వంపై ఖర్గే తీవ్ర విమర్శలు

## తెలంగాణకు ఊపిరితిత్తులు ఈ రెండు జిల్లాలే

- ఈ జిల్లాల్లో ఒక శాతమూ అడవుల్లేవ్?!
- రాష్ట్రంలో అటవీ విస్తీర్ణంలో అసమానతలు
- 0.15 శాతం అడవులను కలిగి ఉన్న కరీంనగర్
- హైదరాబాద్‌లో అటవీ సంపద ఆందోళన కలిగించడానికి కారణమేంటంటే?




**హైదరాబాద్**

అడవులతోనే మానవాళికి ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి. ఎన్నో జబ్బులకు ఔషధాలను అటవీ సంపద అందిస్తుంది. అంతేనా? పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటును అందిస్తుంది. వన్యప్రాణులకైతే అడవే ఆధారం. అలాంటిది రాష్ట్రంలో అటవీ విస్తీర్ణంలో భారీగా అసమానతలు కనిపిస్తున్నాయి. ములుగు జిల్లా అడుగడుగునా పచ్చదనంతో కళకళలాడుతోంది. కొత్తగూడెంలో భారీ విస్తీర్ణంలో అటవీ ప్రాంతం ఉంది. ప్రస్తుతం ఈ రెండు జిల్లాలే 'తెలంగాణకు ఊపిరితిత్తులు' గా మారాయి. కానీ గద్వాల, కరీంనగర్, హైదరాబాద్ వంటి జిల్లాల్లో మాత్రం పచ్చదనం కోసం వెతుక్కోవాల్సి వస్తుంది. రాష్ట్రం భౌగోళిక విస్తీర్ణంలో అటవీ ప్రాంతం 24.05 ఉందని అటవీశాఖ రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన తాజా నివేదికలో తెలిపింది. భూభాగం అటవీ ప్రాంతంలో 71.82 శాతం విస్తీర్ణంలో ములుగు జిల్లా ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 60.95 శాతం అడవులు ఉన్నాయి. నది పరీవాహక ప్రాంతంలో, రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం అధికంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, కుమురంభీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, నాగర్ కర్నూల్ - మిగతా3లో

## మమత వర్గంతో చర్చించాకే

- టీఎంసీ రెబల్ ఎంపీల విలీనంపై స్పీకర్ నిర్ణయం!
- తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో ముదిరిన సంక్షోభం
- తాము ఎన్‌సీపీఐ పార్టీలో విలీనమైనట్లు ప్రకటించిన టీఎంసీ రెబల్ ఎంపీలు
- ఈ విషయంపై త్వరలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకునే ఛాన్స్



## తెలంగాణలో ఏసీబీ మరో రైడ్

- బెడ్ కింద భారీగా నోట్ల కట్టలు
- ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ నరహరి నివాసంలో ఏసీబీ సోదాలు
- ఆదాయానికి మించిన ఆస్తుల కేసు
- నరహరి నివాసం, కార్యాలయంలో ఏసీబీ సోదాలు
- 11 ప్రాంతాల్లో తనిఖీలు



**హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో అవినీతి తిమింగలాలపై ఏసీబీ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. తాజాగా లాండ్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న పక్కా సమాచారంతో చేపట్టిన సోదాల్లో కళ్లు చెదిరే స్థాయిలో అక్రమాస్తులు బయటపడ్డాయి. ఏకంగా రూ.1.54 కోట్లు, కిలో బంగారం భారీగా స్థిరచరాస్తుల పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మధ్య కాలంలో ఏసీబీ దాడుల్లో ఇంట్లో అత్యధికంగా నగదు పట్టుబడిన కేసు ఇదేనని అధికారులు చెబుతున్నారు. అక్రమంగా - మిగతా3లో



## ఆధార్?ను కేవలం గుర్తింపు కార్డుగానే ఉపయోగించాలా?

- కేంద్రం, రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు
- ఆధార్‌ను కేవలం గుర్తింపు కార్డుగా మాత్రమే ఉపయోగించాలి
- పౌరసత్వ రుజువుగా వాడకూడదంటూ పిటిషన్

## సన్నవడ్ల విత్తనాలను సబ్సిడీపై ఇవ్వాలి



- వ్యవసాయ శాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- ఏడు రకాల సన్నవడ్ల విత్తనాలను సబ్సిడీపై ఇవ్వాలన్న సీఎం రేవంత్ రెడ్డి
- అదనపు కలెక్టర్లకు యూరియా పంపిణీ బాధ్యత అప్పగించాలని ఆదేశం
- ఎరువుల పంపిణీలో పారదర్శకత, వేగం పెంచేందుకు అన్ని రకాల ఫెర్టిలైజర్లను యాప్ ద్వారానే బుక్ చేసే విధానం తీసుకురావాలి

**హైదరాబాద్**

విత్తనాల సరఫరా నుంచి పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళికతో నిర్దిష్ట కార్యచరణ అమలు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వచ్చే వ్యవసాయ సీజన్ సాఫీగా జరిగేలా ఉన్నతాధికారుల కమిటీని ఏర్పాటు చేశారు. బోనస్ వచ్చే ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలను రైతు వేదికల్లో సబ్సిడీ రేట్లతో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత, వేగం పెంచేందుకు అన్ని రకాల ఫెర్టిలైజర్లను యాప్ ద్వారానే బుక్ చేసే విధానం తీసుకురావాలని అన్నారు. రామగుండం కర్మాగారంలో ఉత్పత్తయ్యే ఎరువులు అత్యధికంగా - మిగతా3లో



## నీట్ రీ-ఎగ్జామ్- పేపర్ లీక్ వదంతులను నమ్మొద్దు

- నకిలీ వెబ్‌సైట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- ఆన్‌లైన్ ప్రచారాలను నమ్మవద్దు
- అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే ఫిర్యాదు చేయాలి
- నీట్ రీ ఎగ్జామ్ వేళ పలు సూచనలు చేసిన ఎన్‌టీఏ
- అందుబాటులో ఆన్‌లైన్ పోర్టల్


## ఫ్రాన్స్‌లో జీ7 సదస్సు.. కరచాలనం చేసుకున్న మోదీ, ట్రంప్

- ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సుకు ప్రధాని మోదీ హాజరు
- హార్మూజ్ గుండా చమురు సరఫరా సులభతరమైందన్న ట్రంప్
- రష్యా చమురుపై త్వరలో మళ్లీ ఆంక్షలు విధిస్తామని వెల్లడి



# మమత వర్గంతో చర్చించాకే

టీఎంసీ పార్టీ రెబల్ ఎంపీలు తాము నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో (ఎన్‌సీపీఐ) విలీనమయ్యామని, తమకు లోక్‌సభలో ప్రత్యేకంగా సీట్లు కేటాయించాలని స్పీకర్ ఓం బిర్లాను కోరిన నేపథ్యంలో ఆయన నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. తిరుగుబాటు చేసిన 20 మంది తృణమూల్ కాంగ్రెస్ ఎంపీల స్థితిగతులను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పరిశీలిస్తున్నారని, రెండు వర్గాల వాదనలు విన్న తర్వాతే నిర్ణయం తీసుకుంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే లోక్‌సభ స్పీకర్ కార్యాలయం మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ఎంపీల బృందానికి అధికారిక సమావేశం కోసం ఆహ్వానిస్తూ ఈ-మెయిల్ పంపిందని స్పష్టం చేశాయి. తిరుగుబాటు వర్గం కోరిన విలీన అభ్యర్థనపై, పార్టీ అధికారిక నాయకత్వంతో చర్చించిన తర్వాతే స్పీకర్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని వెల్లడించాయి. కాగా, టీఎంసీ లోక్‌సభ సభ్యుల బృందంలో అధికారికంగా చీలిక ఏర్పడిన నేపథ్యంలో ఈ పరిణామం జరిగింది. నేషనలిస్ట్ సిటిజెన్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో విలీనమయ్యామని ఇటీవలే తిరుగుబాటు టీఎంసీ ఎంపీలు ప్రకటించారు. తమకు ప్రత్యేక సీట్లు కేటాయించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి విజ్ఞప్తి చేశారు. తమకు తృణమూల్ మొత్తం ఎంపీల్లో 2/3వంతుకు మించి మెజారిటీ ఉందన్నారు. అందుకే ముందడుగు వేస్తున్నామని, ప్రధాని మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏతో కలిసి దేశం కోసం పని చేస్తామని వివరించారు. ఈ పరిణామంపై టీఎంసీ ఎంపీ కీర్తి ఆజాద్ స్పందించారు. ఈ చర్యను తప్పుదోవ పట్టించేది, అప్రజాస్వామికమని మండిపడ్డారు. టీఎంసీ పార్టీ పూర్తిగా మమతా బెనర్జీ



నాయకత్వంలోనే ఉందని స్పష్టం చేశారు. పార్లమెంటరీ స్థాయిలో అసలు ఉనికి లేని పార్టీలో టీఎంసీ రెబల్ ఎంపీలు ఎలా విలీనం అవుతారు? అని ప్రశ్నించారు. పదవుల కోసం రెబల్ ఎంపీలు తమలో తాము కొట్లాడుకుంటున్నారని ఆరోపించారు.

**'మమతదే టీఎంసీ పార్టీ'**

"నిజమైన తృణమూల్ కాంగ్రెస్ పార్టీ మమతా బెనర్జీదే. టీఎంసీ మమతదేనని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు రాసిన లేఖలో స్పష్టంగా పేర్కొన్నాం. 20 మంది తిరుగుబాటు టీఎంసీ ఎంపీలు స్పీకర్‌కు ఇచ్చిన లేఖ తప్పుదోవ పట్టించేలా ఉంది. తిరుగుబాటు ఎంపీల బృందం వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనిచేస్తోంది. ఇప్పటికే వారిలో అంతర్గత విభేదాలు తలెత్తాయి. ఎవరు మంత్రి కావాలనే విషయంలో ఆ ద్రోహుల (తిరుగుబాటు టీఎంసీ ఎంపీలనుద్దేశించి) మధ్య వివాదం నెలకొంది. రెబల్ ఎంపీలు విలీనం అయిన పార్టీ(నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా)కి పార్లమెంట్‌లో ఎలాంటి ప్రాతినిధ్యం లేదు, అది గుర్తింపు లేని, రిజిస్టర్ కాని పార్టీ. దానికి ఎలాంటి ఉనికి లేదు. ఆ పార్టీలో తిరుగుబాటు టీఎంసీ ఎంపీల విలీనం ప్రజాస్వామ్యబద్ధం కాదు. " అని కీర్తి ఆజాద్ తెలిపారు.

**వార్తల్లో నిలిచిన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా**

ఏమాత్రం పేరు ప్రఖ్యాతులు లేని నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీ ఒక్కసారిగా వార్తల్లో నిలిచింది. అందుకు ప్రధాన కారణం తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నుంచి 20 మంది తిరుగుబాటు ఎంపీలు అందులో విలీనం కావాలని నిర్ణయించుకోవడమే. ఈ పార్టీకి ఎంపీ, ఎమ్మెల్యేలు గానీ లేరు. కాగా, 2023లో జరిగిన త్రిపుర శాసనసభ ఎన్నికల్లో నాలుగు స్థానాల్లో నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా బరిలోకి దిగింది. పార్టీ ఫిరాయింపులు చేసే వారిని తిరస్కరించాలన్న నినాదంతో ఆ పార్టీ ఎన్నికల ప్రచారం చేసింది. పోటీ చేసిన మూడు స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులకు నోటా కంటే తక్కువ ఓట్లు రావడం గమనార్హం. నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీ అధ్యక్షుడిగా బంగాల్‌కు చెందిన ఉట్టియ కుందు ప్రస్తుతం సేవలందిస్తున్నారు. అయితే తృణమూల్ కాంగ్రెస్ తిరుగుబాటు ఎంపీలు చేసిన ప్రతిపాదనకు స్పీకర్ ఓంబిర్లా ఆమోదముద్ర వేస్తే లోక్‌సభలో నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా ఐదో పెద్ద పార్టీగా నిలుస్తుంది. ప్రస్తుతం నాలుగో స్థానంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ తొమ్మిదో స్థానానికి పడిపోతుంది.

# జవాబుదారీతనం అనే పరీక్షలో బీజేపీ ఫెయిల్

పేపర్ల లీకేజీ, పరీక్షల అక్రమాలు జరిగినప్పటికీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోవడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం తీవ్ర విమర్శలు చేశారు. సదరు మంత్రిని రాజీనామా చేయమని కోరకపోవడం ద్వారా మోదీ సర్కార్ జవాబుదారీతనం అనే పరీక్షలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. జూన్ 21న జరగనున్న నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామ్?కు ముందు టెలిగ్రామ్ మెసేజింగ్ యాప్‌పై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడాన్ని కూడా ఆయన ఎక్స్ వేదికగా తప్పుపట్టారు. "నీట్ రీ-టెస్ట్ కోసం మోదీ సర్కార్ టెలిగ్రామ్ యాప్‌ను తాత్కాలికంగా బ్లాక్ చేసింది. కానీ కోట్లాది మంది యువత భవిష్యత్తును బ్లాక్ చేసిన తమ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ని రాజీనామాను ప్రధాని మోదీ కోరాలి. దేశంలోని చైతన్యవంతులైన యువత కేవలం ఒక్కటే డిమాండ్ చేస్తున్నారు. అదే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా. ఇది జవాబుదారీతనానికి మొదటి పరీక్షగా మారింది. దురదృష్టవశాత్తు బీజేపీ ఈ పరీక్షలో పూర్తిగా విఫలమైంది."

**మాఫియాను రక్షించే ప్రయత్నం!**

"భారత వైమానిక దళాన్ని రంగంలోకి దించడం, టెలిగ్రామ్‌ను బ్లాక్ చేయడం లేదా పేపర్ లీక్? మాఫియాను రక్షించేందుకు చిన్న చేపలను పట్టుకోవడం- ఇవన్నీ మోదీ ప్రభుత్వం చేయాల్సి వస్తోంది. ఎందుకంటే గత 10 ఏళ్లలో 90 పేపర్ లీక్‌లు జరిగాయి. ఈ మోసం, అవినీతి వల్ల 9 కోట్ల మంది యువత నష్టపోతున్నారు. ఈ ప్రభుత్వం తన వైఫల్యాలను ఇంకెంత కాలం కప్పిపుచ్చుకుంటుంది" అని ఖర్గే



ప్రశ్నించారు. పరీక్షల్లో జరిగిన అక్రమాల వల్ల దాదాపు అరడజను మంది యువకులు ప్రాణాలు తీసుకున్నారని ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. "మోదీ ఒక్క మాట కూడా మాట్లాడడం లేదు. తమ పిల్లలను రిక్రూట్‌మెంట్ పరీక్షలకు సిద్ధం చేసేందుకు భారీగా అప్పులు చేసిన ఎంతో మంది తల్లిదండ్రులు ఉన్నారు. తీరా చూస్తే, ఒకదాని తర్వాత ఒకటిగా నీట్, ఎస్ఎస్‌సీ, యూజీసీ-నెట్, సీయూఈటీ, ఇతర పరీక్షల పేపర్లు లీక్ అవుతున్నాయి" అని ఖర్గే విమర్శించారు. "పరిస్థితి ఎంత వరకు వచ్చిందంటే, సీబీఎస్?ఈ ఫలితాల్లో ఎంత మోసం జరిగిందంటే, ప్రతిభావంతులైన విద్యార్థులు ఈ ప్రభుత్వ తీరును బట్టబయలు చేశారు. ఇక ఇప్పుడు అత్యంత విశ్వసనీయతకు చిహ్నంగా భావించే యూపీఎస్?సీ పరీక్ష కూడా ఆరోపణల పరిధిలోకి వచ్చింది" అని ఖర్గే ఆరోపించారు.

**రాహుల్ గాంధీ విద్యార్థి సదస్సులు**

పేపర్ లీకేజీ, పరీక్షల అక్రమాల నేపథ్యంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ మొదటి నుంచి డిమాండ్ చేస్తోంది. మరోవైపు ఈ విషయంలో మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థి లోకాన్ని ఏకం చేసే ప్రయత్నాల్లో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జూన్ 17 నుంచి రాజస్థాన్?లోని కోటా నుంచి దేశవ్యాప్తంగా విద్యార్థి సదస్సులు నిర్వహించనున్నారు.

**ప్రతి ఒక్కరూ విద్యార్థులకు అండగా నిలవాలి: ప్రియాంక గాంధీ**

పేపర్ లీకేజ్, పరీక్షల అక్రమాల వల్ల నష్టపోయిన విద్యార్థులకు కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ తన సంఘీభావాన్ని ప్రకటించారు. ప్రభుత్వ పదవుల్లో ఉన్నవారు విద్యార్థులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న కష్టాలను, ఆవేదనను అర్థం చేసుకోవాలని ఆమె అన్నారు. "ప్రజా బాధ్యత కలిగిన మనమందరం విద్యార్థులకు అండగా నిలబడాలి. వారు ఎలాంటి ఇబ్బందులు, బాధలు అనుభవిస్తున్నారో అర్థం చేసుకోవాలి. ఇక్కడ ప్రతి పేపరూ లీక్? అవుతోంది. వారి తల్లిదండ్రులు అప్పులు చేస్తున్నారు. ఈ సమస్య ఏదో ఒక చోట, ఒకరికి మాత్రమే జరిగింది కాదు. ఇది తక్షణం పరిష్కరించాల్సిన ఒక లోతైన వ్యవస్థాగత సమస్య. మనం కచ్చితంగా మార్పు తీసుకురావాలి." విద్యార్థుల్లో నమ్మకాన్ని పునరుద్ధరించడానికి, పదేపదే జరుగుతున్న పరీక్షల అక్రమాలు, లీకేజీల వల్ల వారి తల్లిదండ్రుల కష్టార్జితం వృథా కాకుండా చూడడానికి పరీక్షల విధానంలో సమగ్ర మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని ప్రియాంక గాంధీ నొక్కిచెప్పారు.

# నీట్ రీ-ఎగ్జామ్ పేపర్ లీక్ వదంతులను నమ్మొద్దు

నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామ్‌కు సమయం దగ్గరపడుతున్న తరుణంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) అలర్ట్ జారీ చేసింది. ప్రశ్నా పత్రాల లీకేజీ వదంతులను నమ్మవద్దని విద్యార్థులను సూచించింది. అలాగే, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే ఫిర్యాదు చేయాలని అభ్యర్థులను, వారి తల్లిదండ్రులను కోరింది. నకిలీ వెబ్‌సైట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అలాగే, మోసపూరిత ప్రచారాలకు అడ్డుకట్ట వేయడానికి ఎన్‌టీఏ ఒక ప్రత్యేకమైన ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా ఎవరైనా ఎగ్జామ్ ప్రశ్నాపత్రాలు ఇస్తామని డబ్బులు అడిగినా, లేదా లీక్ అయిందని తప్పుడు ప్రచారం చేసినా నేరుగా ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొంది. అటువంటి మోసగాళ్లపై సైబర్ క్రైమ్ పోలీసుల సహాయంతో కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్‌టీఏ హెచ్చరించింది.

**ఆన్‌లైన్ మోసాలపై నిఘా**

ఇదిలా ఉండగా, నీట్ రీ ఎగ్జామ్‌లో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూసేందుకు అధికారులు అన్ని రకాలు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే ఆన్‌లైన్ మోసాలపై పర్యవేక్షణను కఠినతరం చేశారు. నీట్ పరీక్షా పత్రాలు తమ వద్ద ఉన్నాయని తప్పుడు ప్రచారం చేస్తూ, అభ్యర్థులను మోసం చేయడానికి కొన్ని మోసపూరిత ముఠాలు, సోషల్ మీడియా ఖాతాల ద్వారా ప్రయత్నిస్తున్నాయని ఎన్‌టీఏ తెలిపింది. అయితే, పరీక్షకు ముందే ప్రశ్నపత్రం ఎవరికీ అందుబాటులో ఉండదని, పేపర్ తయారీ, నిల్వ, రవాణా వంటి ప్రక్రియల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సంస్థ మరోసారి స్పష్టం చేసింది.

**అందుబాటులో అడ్మిట్ కార్డులు**

ఇక, నీట్ అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్ ప్రక్రియ ప్రారంభమైంది. వెబ్‌సైట్ ప్రారంభమైన మొదటి 24 గంటల్లోనే 10 లక్షల



మందికి పైగా అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకున్నారని ఎన్‌టీఏ పేర్కొంది. కొన్నిచోట్ల డౌన్‌లోడ్ లింక్ సరిగ్గా పనిచేయకపోవడం వల్ల అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిసింది. అయితే, సాంకేతిక సమస్యలు, సర్వర్‌పై అధిక భారం కారణంగానే ఈ సమస్య తలెత్తిన్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. సమస్యలను పరిష్కరించే దిశగా తమ బృందం పనిచేస్తుందని పేర్కొంది.

మరోవైపు, రీఫండ్ విషయంలోనూ అభ్యర్థులకు ఎన్?టీఏ పలు సూచనలు చేసింది. అడ్మిట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకునే ముందు, తమ బ్యాంక్ ఖాతా వివరాలను సరిచూసుకోవాలని అభ్యర్థులకు సూచించింది. కాగా, దేశవ్యాప్తంగా జూన్ 21న నీట్ రీ ఎగ్జామ్ జరగనుంది. దాదాపు 23 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారు.

**15 నిమిషాల పొడగింపు**

ఇక, పరీక్ష నియమావళిలో ఎన్?టీఏ కొన్ని మార్పులు చేసింది. విద్యార్థుల సౌకర్యార్థం పరీక్షా సమయాన్ని మరో 15 నిమిషాలు పొడగిస్తున్నట్లు ఇటీవల ప్రకటించింది. పరీక్ష ప్రారంభానికి ముందు, తర్వాత ఇన్విజిలేషన్? ప్రక్రియకు పెంచిన సమయం ఉపయోగపడుతుందని తెలిపింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల 15 నిమిషాల వరకు పరీక్ష జరగనున్నట్లు పేర్కొంది. అయితే, అభ్యర్థుల నుంచి అభిప్రాయాలు సేకరించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ పేర్కొంది. వీటితోపాటు ప్రశ్నపత్రం బుక్‌లెట్‌లో రఫ్ వర్క్‌కోసం కేటాయించిన పేజీల సంఖ్యను, రెండు నుంచి నాలుగుకు పెంచినట్లు తెలిపింది. విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ప్రశ్నాపత్రం మొదట్లో, చివర్లో రెండేసి రఫ్ పేపర్లను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించింది.

**టెలిగ్రామ్‌పై ఆంక్షలు**

మరోవైపు, ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్టవేయాలనే లక్ష్యంతో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో టెలిగ్రామ్ యాక్సెస్‌ను జూన్ 22 వరకు తాత్కాలికంగా ఆంక్షలు విధించినట్లు పేర్కొంది. ఎన్‌టీఏ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే, నీట్ రీ ఎగ్జామ్?కు ముందు తప్పుడు ప్రచారాలు, వ్యవస్థీకృత మోసాల నెట్‌వర్క్‌లను నిరోధించడానికి ఈ చర్య తీసుకున్నట్లు ఏజెన్సీ తెలిపింది.

## ఆధార్‌ను కేవలం గుర్తింపు కార్డుగానే ఉపయోగించాలా?

యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ జారీ చేసే ఆధార్ కార్డులను పౌరసత్వం, స్థానికత, నివాస చిరునామా రుజువులుగా ఉపయోగిస్తూ దుర్వినియోగం చేస్తున్నారని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. మంగళవారం విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్పందనను కోరింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి.మోహన్‌లతో కూడిన ధర్మాసనం, అడ్వకేట్ అశ్విని కుమార్ ఉపాధ్యాయ దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. అలాగే ఈ పిటిషన్‌ను ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఇలాంటి ఇతర కేసులతో జత చేసింది. ఆధార్‌ను కేవలం గుర్తింపు కార్డుగా ఉపయోగించేలా పరిమితం చేయాలని పిటిషనర్ అశ్విని కుమార్ ఉపాధ్యాయ కోరారు. దీనిని పౌరసత్వం, స్థానికత, చిరునామా, పుట్టిన తేదీకి రుజువుగా వాడకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఎన్నికల సంఘానికి కూడా తగిన ఆదేశాలు ఇవ్వాలని సుప్రీం కోర్టును కోరారు. న్యాయవాది అశ్వినీ దూబే ద్వారా ఈ పిటిషన్?ను సర్వోన్నత న్యాయస్థానంలో దాఖలు చేశారు. కొత్త ఓటరు నమోదు కోసం దరఖాస్తు ఫారమ్‌లో పుట్టిన తేదీ, నివాస రుజువుగా ఆధార్‌ను ఉపయోగించడానికి పిటిషనర్ సవాల్ చేశారు. ఇది ఆధార్ చట్టం, 2016లోని సెక్షన్? 9, ప్రజాప్రాతినిధ్య చట్టం (ఆర్‌పీఏ)- 1950లోని సెక్షన్? 23(4), రాజ్యాంగంలోని ఆర్టికల్? 14కు విరుద్ధమని పేర్కొన్నారు.

**అక్రమ చొరబాటుదారులకు వరంగా మారింది!**

"ఆధార్ చట్టం, 2016లోని సెక్షన్ 9 చాలా స్పష్టంగా ఆధార్ అనేది పౌరసత్వం లేదా స్థానికతకు రుజువు కాదు అని చెబుతోంది. అలాగే 2023 ఆగస్టు 22 నాటి యూఐడీఏఐ నోటిఫికేషన్ కూడా ఆధార్ అనేది గుర్తింపునకు మాత్రమే రుజువు, పౌరసత్వం, చిరునామా, పుట్టిన తేదీకి కాదు అని స్పష్టం చేస్తోంది. అయినప్పటికీ పాఠశాల ప్రవేశాలు, ఆస్తి కొనుగోళ్లు, జనన ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్సుల కోసం వయస్సు, పౌరసత్వం, స్థానికత రుజువుగా ఆధార్‌ను ఉపయోగిస్తున్నారు. అంతేకాదు కొత్త ఓటరు నమోదు దరఖాస్తు ఫారమ్ (ఫారమ్-6)లో పుట్టిన తేదీ, నివాస రుజువుగా కూడా వాడుతున్నారు. దీని వల్ల చొరబాటుదారులు, అక్రమ వలసదారులు ఆధార్?ను ఉపయోగించి వివిధ రకాల అధికార పత్రాలు పొందుతున్నారు" అని పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఫారమ్-6 కింద చేస్తున్న వెరిఫికేషన్ విధానం చాలా లోపభూయిష్టంగా ఉందని, సరైన పత్రాలు లేని వ్యక్తులు కూడా ఓటర్ల డేటాబేస్?లో చేరిపోయే ప్రమాదం ఉందని పిటిషనర్ పేర్కొన్నారు. అందుకే ఎన్నికల ప్రక్రియలో ఉపయోగించే వెరిఫికేషన్ విధానాన్ని సమూలంగా పునర్వ్యవస్థీకరించాలని ఆయన కోరారు. ఈ సంస్కరణలను పర్యవేక్షించడానికి సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తితో పాటు, సైబర్ సెక్యూరిటీ, ఫోరెన్సిక్ నిపుణులతో కూడిన హై-పవర్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**విదేశీయులు కూడా ఆధార్ పొందవచ్చు!**

ఆధార్ చట్టం ప్రకారం, విదేశీ పౌరులతో సహా దేశంలోని నివాసితులు అందరూ ఆధార్ కార్డు పొందే హక్కు ఉందని పిటిషనర్ అన్నారు. ఓ వ్యక్తి ఒక ఏడాదిలో 182 రోజులు భారతదేశంలో నివసిస్తే, ఆధార్ కార్డు పొందడానికి అర్హత వచ్చేస్తుందని ఆయన పేర్కొన్నారు. అద్దె ఒప్పందాలు, స్థానిక అధికారుల సిఫారసులు వంటి పత్రాల ఆధారంగా ఎన్‌రోల్మెంట్ కేంద్రాల నుంచి ఆధార్ పొందవచ్చని తెలిపారు. అందుకే ఈ లూప్? హోల్స్‌ను ఆసరాగా చేసుకొని అక్రమ వలసదారులు, చొరబాటుదారులు ఆధార్?ను సంపాదిస్తున్నారని, ఆ తర్వాత దానిని ఉపయోగించి ఓటరు గుర్తింపు కార్డుతో సహా ఇతర గుర్తింపు పత్రాలను కూడా సులభంగా పొందగలుగుతున్నారని తన పిటిషన్?లో పేర్కొన్నారు. కనుక ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 23(4) ప్రకారం, ఆధార్?ను కేవలం గుర్తింపును నిరూపించుకోవడానికి మాత్రమే ఉపయోగించాలని, వయస్సు, నివాసానికి రుజువుగా వాడకూడదని పిటిషనర్ పేర్కొన్నారు. ఆధార్ ఉపయోగించి దేశంలోకి చొరబడుతున్న అక్రమ వలసదారుల వల్ల ఎన్నికల్లో పారదర్శకత లేకుండా పోతోందని అన్నారు. జనాభా మార్పులు (డెమోగ్రాఫిక్ ఛేంజ్) వస్తున్నాయని, దేశ భద్రతకు తీవ్ర విఘాతం కలిగే అవకాశం ఉందని పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు.

## ఫ్రాన్స్‌లో జీ7 సదస్సు.. కరచాలనం చేసుకున్న మోదీ, ట్రంప్

ఫ్రాన్స్‌లోని ఇవియాన్‌లో జరుగుతున్న జీ7 శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. మంగళవారం నిర్వహించిన కీలకమైన 'ఔట్‌రీచ్ సెషన్'లో భాగంగా ఆయన ప్రపంచ నేతలతో కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరస్పరం కరచాలనం చేసుకుని, ప్రత్యేకంగా చర్చించుకోవడం విశేషం. ఈ సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, రష్యా చమురుపై త్వరలోనే అమెరికా మళ్లీ ఆంక్షలు విధించే అవకాశం ఉందని సంచలన ప్రకటన చేశారు. ఇరాన్‌తో ఇటీవలే కుదిరిన ఒప్పందం కారణంగా హర్మూజ్ జలసంధి గుండా చమురు సరఫరా సులభతరమైందని, ఇది రష్యాపై కఠిన చర్యలు తీసుకునేందుకు వీలు కల్పిస్తుందని ఆయన వివరించారు. ఉక్రెయిన్‌పై దాడి నేపథ్యంలో మాస్కోపై ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచేందుకు జీ7 దేశాలు కొత్త మార్గాలను అన్వేషిస్తున్న తరుణంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. సాధారణంగా జీ7 సభ్య దేశాలు, తాము ఆహ్వానించిన ఇతర దేశాల అధినేతలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో కలిసి ఈ ఔట్‌రీచ్ సెషన్‌ను నిర్వహిస్తాయి. ప్రపంచం ఎదుర్కొంటున్న కీలక ఆర్థిక, రాజకీయ సవాళ్లపై విస్తృతంగా చర్చించి, సరైన పరిష్కార మార్గాలను కనుగొనడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం.

## టెలిగ్రామ్‌పై కేంద్రం కీలక నిర్ణయం నీట్ పరీక్ష అయ్యే వరకు బ్యాన్

నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామ్?కు ముందు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షల్లో అక్రమాలు, ప్రశ్నాపత్రం లీక్‌ల పేరుతో జరుగుతున్న మోసాలు, తప్పుడు ప్రచారాలను అరికట్టేందుకు మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌పై తాత్కాలిక ఆంక్షలు విధించింది. 2026 జూన్ 22 వరకు దేశంలో టెలిగ్రామ్ సేవల పరిమితం చేయాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ ఆదేశాలు జారీ చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) చేసిన సిఫార్సుల మేరకు, సమాచార సాంకేతిక చట్టం-2000లోని సెక్షన్ 69ఏ కింద ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. జూన్ 21న జరగనున్న నీట్ రీ-ఎగ్జామ్? రోజుతో పాటు ఆ తర్వాతి రోజు వరకు ఈ పరిమితులు అమల్లో ఉంటాయి. పరీక్షలు రాసే విద్యార్థులను మోసం చేస్తున్న గ్రూపులు టెలిగ్రామ్‌ను విస్తృతంగా ఉపయోగిస్తున్నాయని, అందుకే ఈ చర్యలు చేపట్టినట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. అయితే టెలిగ్రామ్‌లో ఇప్పటికే పంపిన సందేశాలను తర్వాత సవరించే సదుపాయాన్ని కూడా జూన్ 30 వరకు భారతదేశంలో నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. పరీక్ష ముగిసిన తర్వాత అసలు ప్రశ్నాపత్రాలను పాత సందేశాల్లో జతచేసి, అవి ముందుగానే లీక్ అయ్యాయని తప్పుడు ఆధారాలు సృష్టించే ఘటనలు ఇటీవల పెరిగినట్లు ఎన్‌టీఏ పేర్కొంది. ఈ ఫీచర్‌ను దుర్వినియోగం చేస్తూ కొందరు నిర్వాహకులు పరీక్ష అనంతరం అసలు ప్రశ్నాపత్రాన్ని పాత పోస్టుల్లో జతచేసి, వాటి స్క్రీన్‌షాట్లను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని తెలిపింది. టెలిగ్రామ్‌ను విద్య, ఉద్యోగ, వ్యక్తిగత అవసరాల కోసం ఉపయోగించే లక్షలాది మంది వినియోగదారులకు ఈ నిర్ణయం కొంత అసౌకర్యం కలిగించవచ్చని ఎన్‌టీఏ అంగీకరించింది. అయితే పరీక్షల పారదర్శకత, భద్రత కోసం ఈ చర్యలు తప్పనిసరి అయ్యాయని తెలిపింది.

**జూన్ 21న రీ-ఎగ్జామ్**

దేశవ్యాప్తంగా మే 3న నిర్వహించిన నీట్-యూజీ 2026 పరీక్షలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తడంతో ఆ పరీక్షను రద్దు చేశారు. దీంతో లక్షలాది మంది వైద్య విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడింది. ఈ నేపథ్యంలో జూన్ 21న మళ్లీ పరీక్ష నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే రీ-ఎగ్జామ్ ప్రశ్నపత్రాల తయారీలో పాల్గొన్న నిపుణులను రహస్య ప్రదేశంలో లాక్‌డౌన్‌లో ఉంచినట్లు వార్తలు వచ్చాయి. అయినా సరే రీటెస్ట్ పేపర్ కూడా లీక్ అయిందంటూ వదంతులు వ్యాపించాయి. వాటిని ఇప్పటికే ఎన్‌టీఏ ఖండించింది. నీట్ రీ-ఎగ్జామ్? నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే జూన్ 21న జరుగుతుందని స్పష్టం చేసింది. పరీక్షకు సంబంధించిన సమాచారం కోసం అధికారిక ఎన్‌టీఏ ప్రకటనలు, వెబ్‌సైట్‌ను మాత్రమే నమ్మాలని సూచించింది. ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతున్న తప్పుడు సమాచారాన్ని, పేపర్ లీక్ ప్రకటనలను పూర్తిగా విస్మరించాలని కోరింది.

# హైదరాబాద్ మెట్రోపై మాకు వివక్ష లేదు

-మొదటిపేజీ తరువాయి

పని చేశామని, ఇప్పుడూ పని చేస్తామని, తెలంగాణకు ఇచ్చిన హామీలు తూచా తప్పకుండా అమలు చేస్తున్నామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ బిడ్డగా, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాటం చేశానని, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం దిల్లీకు వచ్చి రెండుసార్లు ధర్నా చేశామని గుర్తు చేశారు. బిల్లు ఆమోదం పొందిన తర్వాతే ఏపీ భవన్‌లో ఆమరణ దీక్ష విరమించానని గుర్తు చేశారు.

**ప్రధాని చేతుల మీదుగా ఫేజ్-2 ప్రారంభించాం**

తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధి పట్ల మాకెవరూ పాఠాలు చెప్పనక్కర్లేదన్న కేంద్రమంత్రి హితువు పలికారు. రైల్వేస్టేషన్ల అభివృద్ధి కోసం నాడు కేసీఆర్, ఇప్పుడు రేవంత్‌రెడ్డికి లేఖలు రాశానని తెలిపారు. రేవంత్ రెడ్డి కోరితే రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు చేపట్టలేదని, కేంద్ర ప్రభుత్వం బాధ్యతగా తీసుకుని అభివృద్ధి పనులు చేపట్టిందని పేర్కొన్నారు. ఎంఎంటీఎస్ ఫేజ్-2 కోసం కేసీఆర్ సహకరించకలేదని ఆరోపించారు. కేసీఆర్ సహకరించకపోయినా ప్రధాని చేతుల మీదుగా ఫేజ్-2 ప్రారంభించామన్నారు. తెలంగాణకు రాదనుకున్న రైల్వే ఫ్యాక్టరీని సాధించామని, ఏ పార్టీల ప్రభుత్వాలు ఉన్నా అన్ని రాష్ట్రాలకు కేంద్రం సహకారం అందిస్తోందని స్పష్టం చేశారు. రూ.34 వేల కోట్లు ఎన్‌సీడీసీ తెలంగాణకు అందించింది : మోదీ ఇస్తుంటే కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారనడం దిగజారుడు



రాజకీయాలేనని మండిపడ్డారు. తమ ప్రభుత్వం ఉన్నన్ని రోజులూ తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, 50 ఏళ్లు వడ్డీ లేకుండా ఇటీవల సాస్కీ రుణాలను కేంద్రం ఇచ్చిందని స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవం కోసం ఏడీబీ రుణానికి కేంద్రం ఎన్‌వోసీ ఇచ్చిందని, ఎన్‌సీడీసీ ద్వారా పదేళ్లుగా తెలంగాణకు రూ.లక్ష కోట్లు మంజూరు చేశామని, ధాన్యం కొనుగోళ్లకు రూ.37 వేల కోట్లను ఎన్‌సీడీసీ ద్వారా మంజూరు అయ్యాయని, ఇప్పటికే రూ.34 వేల కోట్లు ఎన్‌సీడీసీ తెలంగాణకు అందించిందని వెల్లడించారు.

**ప్రాజెక్టులకు సహకరిస్తాం**

ప్రాజెక్టుకు సంబంధించి అనేక మార్పులను రాష్ట్రానికి కేంద్రం సూచించిందని, ప్రాజెక్టులు ఆపే సంస్కృతి బీజేపీకి లేదని అది కాంగ్రెస్‌కే ఉండవచ్చని ఆగ్రహం వ్యక్తం చేశారు. డొంకదారిన ప్రాజెక్టులు అడ్డుకోవాల్సిన కర్మ తమకు లేదని, రేవంత్ రెడ్డి కోసమో, మరెవరి కోసమో ప్రాజెక్టులు అడ్డుకోమని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం ప్రాజెక్టులకు సహకరిస్తామని స్పష్టం చేశారు.

"మెట్రో ఫేజ్ 2 మరింత వేగవంతానికి నేను సీఎంకు లేఖలు రాశా. ఐఆర్‌ఎఫ్‌సీతో ఒప్పందం మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.13 వేల కోట్లు తీసుకునేందుకు కేంద్రం సహకరించింది. రుణ ఒప్పందం విషయమై అధికారులతో ఫోన్‌లో మాట్లాడాను. మెట్రో-1 కోసం రాష్ట్ర ప్రభుత్వం ఐఆర్‌ఎఫ్‌సీ ద్వారా రుణం తీసుకుంటోంది. రుణం విషయమై రాష్ట్ర ప్రభుత్వం, ఐఆర్‌ఎఫ్‌సీ మధ్య ఒప్పందం జరిగింది. టికెట్లు, యాడ్ ఆదాయాన్ని ముందుగా అప్పు చెల్లించాలని ఒప్పందం జరిగింది. ఈ విషయమై కేంద్ర సూచనలకు సీఎం అంగీకరించట్లేదని చెప్పారు. అన్ని మెట్రోలు తీసుకున్న రుణాలు వాటికే ముందుగా చెల్లించరు. రెగ్యులర్ మెట్రో ఆపరేషన్, నిర్వహణకు ముందుగా వచ్చిన ఆదాయం చెల్లించాలి. ఆ తర్వాతే రుణాలకు సంబంధించి మిగతా డబ్బులు చెల్లించాలి" - కిషన్ రెడ్డి, కేంద్ర మంత్రి

# తెలంగాణలో విచారణల పాలిటిక్స్

**హైదరాబాద్ :** తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ నేతలకు మధ్య పలు కేసుల విచారణకు సంబంధించి రాజకీయం జోరుగా సాగుతోంది. బీఆర్ ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ హయాంలో జరిగిన.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సంచలనంగా మారిందని..దీనిని సీబీఐతో దర్యాప్తు చేయించాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రానికి లేఖ రాశారు. కానీ, దీనిపై ఇప్పటి వరకు అతీ గతీ లేదని, కేసీఆర్‌ను కాపాడుతున్నారని సీఎం రేవంత్ పలుసందర్భాల్లో ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారనే ఆరోపణలు వచ్చాయి. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ మాజీ అధికారులు కొందరు ఈ కేసులో అరెస్ట్ అయ్యారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ఎస్ఐబీ మాజీ ఉన్నతాధికారులు విదేశాలకు వెళ్లిపోవడంతో, వారిపై రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేయడానికి సీబీఐ ఇంటర్‌పోల్‌కు లేఖ రాసింది. ఫోన్‌ట్యాపింగ్ కేసులో అవినీతి కోణాలు కూడా ఉన్నాయని భావించిన రాష్ట్ర ప్రభుత్వం? ఈడీ, సీబీఐ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తూ.. లేఖలు సంధించింది. కానీ, ఇప్పటి వరకు కేంద్రం నుంచి సరైన సమాధానం రాలేదన్నది సర్కారు చెబుతున్న మాట.ఈ విషయాన్ని కట్ చేస్తే.. తాజాగా బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని మరో డిమాండ్ చేశారు. సింగరేణి కేలరీస్ లో భారీ ఎత్తున కుంభకోణం జరిగిందని వార్తలు వస్తున్నాయని ఆయన తెలిపారు. దాదాపు 16 వందల కోట్ల రూపాయల విలువైన బొగ్గు దారి మళ్లిందని.. ఇదంతా ఎవరి హయాంలో జరిగింది? దీనివెనుక ఎవరు ఉన్నారు? అనే విషయాలను తేల్చాలని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే దర్యాప్తు చేయించాలని కిషన్ రెడ్డి కోరారు. అంతేకాదు..



సింగరేణి భద్రతను కట్టుదిట్టం చేయాలన్నారు.కేసీఆర్ సర్కారు కేంద్రంగా ఇటు కాంగ్రెస్, అటు బీజేపీలు పరస్పరం విమర్శలు చేసుకుంటూనే ఉన్నాయి. అంతేకాదు.. ఒకరిపై ఒకరు మీరు విచారణ చేపట్టాలంటే మీరు విచారణ చేపట్టాలని నిలదీతలు కనిపిస్తున్నాయి. ఇంతకు మించి.. ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం వెనుక వీటిని రాజకీయ వస్తువులుగానే వినియోగించుకునే అవకాశం ఉందన్న వాదన బలంగా వినిపిస్తుండడం గమనార్హం.కాగా.. ప్రస్తుతం కిషన్ రెడ్డి లేవనెత్తిన సింగరేణి బొగ్గు గనుల వ్యవహారం కూడా రాజకీయపరమైన అంశంగానే కనిపిస్తోందని పరిశీలకులు చెబుతున్నారు. ఎందుకంటే.. బొగ్గుగని కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నా.. గనుల నిల్వలు.. సరుకు రవాణా.. కేటాయింపు ఇలా.. అన్ని విషయాలు బొగ్గు, గనుల శాఖ మంత్రిగా కిషన్ రెడ్డి పరిధిలోనే ఉంటాయి. కాబట్టి.. ఈ రచ్చ ఇలా కొనసాగుతుందా.. లేక పరిష్కారం లభిస్తుందా? అనేది చూడాలి.

# సింగూరు డ్యామ్‌కు డేంజర్ బెల్స్

**మెదక్ :** ఉమ్మడి మెదక్ జిల్లా వ్యవసా య రంగానికి వెన్నెముకగా, హైదరాబాద్ జంట నగరాల దాహార్తిని తీర్చే ప్రధాన వనరుగా ఉన్న సింగూరు మల్టీపర్పస్ ప్రాజెక్టు (మంజీరా నది) ప్రస్తుతం అత్యంత కీలకమై న దశను ఎదుర్కొంటోంది. ప్రాజెక్టు భద్రతపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ప్రస్తుతం రిజర్వాయర్‌లో యుద్ధప్రాతిపదికన మరమ్మ తులు సాగుతున్నాయి.అయితే సింగూరు ప్రాజెక్టు మరమ్మతు పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, పనుల మందగమనంపై క్షేత్రస్థాయిలో తీవ్ర అసం తృప్తి వ్యక్తమవుతోంది. ఇటీవల ఎన్‌డీఎస్‌ఏ ఉన్నతాధికారుల తనిఖీల్లో కూడా స్పష్టమైంది. మార్చిలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి చెందిన ఉన్నత స్థాయి నిపుణుల బృందం సింగూరు ప్రాజెక్టును నేరుగా సందర్శించి, సాగుతున్న పనులను పరిశీలించింది. ఆ సమయంలో కాంట్రాక్టర్ వ్యవహరించిన తీరుపై వారు తీవ్ర అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రాజెక్టు అత్యంత ప్రమాదకర స్థితిలో ఉంటే, కాంట్రాక్టర్ క్షేత్రస్థాయిలో కేవలం ఒక్క జేసీబీ, ఒక ట్రక్కును మాత్రమే ఉపయోగించి పనులు చేయడంపై అధికారులు తీవ్రస్థాయిలో మండిపడినట్లు తెలిసింది. రిజర్వాయర్ ఎర్త్ డ్యాం లోపలి భాగంలో ఎక్కడైతే రివిట్‌మెంట్ తీవ్రంగా దెబ్బతిని బుంగలు పడ్డాయో, అక్కడ మొదట పనులు ప్రారంభించాల్సింది పోయి.. డ్యాంకు ఒక చివర నుంచి సాధారణ పద్ధతిలో పనులు చేపట్టడంపై నిపుణులు తప్పుపట్టారు. అయితే కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతోనే పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వానాకాలం సీజన్‌లో ప్రాజెక్టు పూర్తి సామర్థ్యంతో కాకుండా కేవలం 15 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేయాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. సింగూరు ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 29.91 టీఎంసీలు కాగా, రివిట్‌మెంట్‌లో ఏర్పడిన బుంగలు, లీకేజీల కారణంగా రక్షణ చర్యల్లో భాగంగా నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం మరమ్మతు పనుల కోసం నీటి నిల్వను గతంలో 8 టీఎంసీలకు తగ్గించగా, వేసవి అవసరాల తర్వాత ప్రస్తుతం అది మరింత పరిమితమయ్యే అవకాశం ఉంది.ఈ వానాకాలంలో కర్ణాటక, మహారాష్ట్ర క్యాచ్‌మెంట్ ఏరియాల



నుంచి భారీగా వరద నీరు వచ్చినా.. రక్షణ దృష్ట్యా 15 టీఎంసీలకు మించి నిల్వ చేయకుండా మిగిలిన నీటిని గేట్లు ఎత్తి దిగువకు వదలాలని నిర్ణయించారు. డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్ (డీఎస్ఆర్పీ) హెచ్చరికల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఈ పనులను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రాజెక్టు ఆధునికీకరణ, గేట్లు, హోయిస్ట్ పరికరాలు, స్టాప్ లాగ్ ఎలిమెంట్స్, గ్యాంట్రీ క్రేన్ల మరమ్మతుల కోసం ప్రభుత్వం సుమారు రూ. 22 కోట్ల నిధులు మంజూరు చేయగా, పనులు చేపట్టారు. అలల తాకిడికి దెబ్బతిన్న రిజర్వాయర్ లోపలి భాగంలోని పాత రివిట్‌మెంట్లు తొలగించి, రాళ్లతో కొత్తగా పటిష్టమైన నిర్మాణాలు చేపడుతున్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, గచ్చిబౌలి, మాదాపూర్, మణికొండ వంటి పశ్చిమ ప్రాంతాలకు సింగూరే ప్రధాన తాగునీటి వనరు. వేసవిలో నీటి నిల్వలు తగ్గినప్పటికీ, హైదరాబాద్ జలమండలి ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా నీటి సరఫరాను క్రమబద్ధీకరించింది. ఈ సీజన్‌లో నిల్వ చేయబోయే 15 టీఎంసీల నీరు జంట నగరాల తాగునీటి అవసరాలకు (ఏడాదికి దాదాపు 4 టీఎంసీలు అవసరం), పరిశ్రమలకు పూర్తిగా సరిపోతుంది. దీంతో హైదరాబాద్ తాగునీటి సరఫరాకు ఎలాంటి ముప్పు లేదని అధికారవర్గాలు చెపుతున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యపు పనులపై వివరణ కోరేందుకు ఇరిగేషన్ శాఖ డీఈని సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.వానాకాలం సీజన్ ముంచుకొస్తున్న వేళ.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు మరింత ఆలస్యమైతే సాగు, తాగునీటి సరఫరాపై ప్రభావం పడనుంది. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అధికారికంగా దాదాపు 40 వేల ఎకరాల ఆయకట్టుకు ఈ ప్రాజెక్టు నీరందిస్తున్నప్పటికీ సుమారు 80వేల ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యాన్ని 15 టీఎంసీలకే పరిమితం చేస్తున్నందున, వానాకాలం సాగునీటి విడుదలపై ప్రభావం ఉండే అవకాశం ఉంది. క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వచ్చే వరద నీటిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ పంటలకు నీరు విడుదల చేయాలని ఇరిగేషన్ శాఖ భావిస్తోంది. అయితే పూర్తి నిల్వ లేకపోవడం వల్ల రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మరమ్మతు పనులు నత్తనడకన కొనసాగడంతో వానాకాలం సీజన్‌లో క్రాప్ హాలిడే ప్రకటించే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా కామారెడ్డి, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలకు మిషన్ భగీరథ నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడే అవకాశం ఉంది. పనులు పూర్తి కాకపోతే ఈ వానాకాలం వరదలు వచ్చినా రక్షణ దృష్ట్యా కేవలం 15 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ ఉంచగగుతారు.మిగిలిన నీటిని వృథాగా దిగువకు వదలాల్సి వస్తుంది. ఎన్‌డీఎస్‌ఏ హెచ్చరికలు, ప్రభుత్వం నుండి వచ్చిన ఒత్తిడితో ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రస్తుతం కాంట్రాక్టర్‌పై నిఘా పెంచారు. యంత్రాల సంఖ్యను, కూలీల సంఖ్యను పెంచి వర్షాకాలం ఉధృతి పెరగక ముందే ప్రధాన పనులను ఒక కొలిక్కి తెచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు తెలిసింది. సింగూరు ప్రాజెక్టుపై కొన్ని చోట్ల జరుగుతున్న పనుల నాణ్యత ఎన్‌డీఎస్‌ఏ ప్రమాణాలమేరకు చేపట్టడంలేదని అధికారులు హెచ్చరించారు. ఈ నిర్లక్ష్యంపై నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు రక్షణ విషయంలో రాజీ పడబోమని, కాంట్రాక్టర్లు ఒకే సీజన్ లోపల పనులన్నీ పూర్తిచేయాలని కఠినంగా ఆదేశించారు.పనులను వేగవంతం చేయకపోతే క్రాప్ హాలిడే (పంటల విరామం) ప్రకటించాల్సి వస్తుందని, అది రైతులకు నష్టం కలిగిస్తుందని కాంట్రాక్టర్‌ను, స్థానిక ఇరిగేషన్ అధికారులను హెచ్చరించారు. నీటి అడుగున ఎక్కడైనా పగుళ్లు లేదా లీకేజీలు ఉన్నాయా అని తెలుసుకోవడానికి సోనార్ పరీక్షలు, అండర్ వాటర్ సర్వేలు త్వరితగతిన నిర్వహించాలని మంత్రి సూచించారు.

## సన్నవడ్ల విత్తనాలను సబ్సిడీపై ఇవ్వాలి

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణకే కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలోని అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం నిర్వహించి, ఎరువులపై వాస్తవ పరిస్థితిని వివరించాలని సీఎం తెలిపారు.

**రైతుల వివరాల నమోదు**

రైతులకు విత్తనాల సరఫరా నుంచి పండించిన పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళికతో పాటు నిర్దిష్ట కార్యాచరణ అమలు చేయాలని సీఎం అదేశించారు. పంట వేసినప్పటి నుంచే రైతుల వివరాల నమోదు, పంటల వివరాల రికార్డులు, దిగుబడి అంచనాలు, ధాన్యం కొనుగోళ్ల వరకు ప్రతి దశలో వ్యవసాయ శాఖకు పూర్తి అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో రానున్న వ్యవసాయ సీజన్‌పై సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులు ఇబ్బంది పడకుండా చేపట్టాల్సిన చర్యలపై రైతు కమిషన్, అగ్రికల్చర్ యూనివర్సిటీ, వ్యవసాయ నిపుణులు ఇచ్చిన సూచనలను సమీక్షించారు. వచ్చే సీజన్ కొనుగోళ్లు సాఫీగా జరిగేలా ఇప్పుడే ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని అదేశించారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్, పౌరసరఫరాల శాఖ ఎండీ, ప్రణాళిక శాఖ కార్యదర్శి సభ్యులుగా కమిటీ ఏర్పాటు చేశారు.

**అందుబాటులో 7 రకాల సన్న వడ్ల విత్తనాలు**

కనీస మద్దతు ధరలు కేంద్రం నిర్దేశించిన కోటాకు అనుగుణంగా రాష్ట్రంలో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు సాఫీగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలో అకాల వర్షాలు, తూకం, రవాణా, నిల్వ, మార్కెటింగ్ వంటి అంశాలపై ముందుగానే కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. సన్న వడ్లు పండించే రైతులకు బోనస్ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో 7 రకాల సన్న వడ్ల విత్తనాలను రైతు వేదికల్లో సబ్సిడీ రేట్లతో అందుబాటులో ఉంచాలని సీఎం ఆదేశించారు.

**సాంకేతిక పరిజ్ఞానం అనుసంధానం**

వ్యవసాయ శాఖలో సాంకేతికత వినియోగాన్ని మరింత పెంచుకోవాలని సీఎం సూచించారు. ఏఐ ఆధారిత విధానాలను సమర్థంగా వినియోగించాలని చెప్పారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని విత్తనాల నుంచి కొనుగోళ్ల వరకు మొత్తం వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడం జిల్లా దమ్మపేట మండలంలో ప్రారంభించిన ఏఐ పైలట్ ప్రాజెక్ట్ ఫలితాలు అధ్యయనం చేయాలని చెప్పారు.

**రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీ**

ఎరువుల పంపిణీలో పారదర్శకత, వేగం పెంచేందుకు అన్ని రకాల ఫెర్టిలైజర్లను యాప్ ద్వారా బుక్ చేసే విధానం తీసుకురావాలని సీఎం ఆదేశించారు. యూరియాను రైతు వేదికల ద్వారా పంపిణీ చేయాలని సూచించారు. పంపిణీ బాధ్యతను జిల్లా అదనపు కలెక్టర్లకు అప్పగించాలని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా కేటాయింపులపై ఎప్పటికప్పుడు కేంద్రానికి లేఖలు రాయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సూచించారు. రైతు వేదికలను పూర్తిగా రైతులకు ఉపయోగపడే కేంద్రాలుగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. రైతులు అక్కడే తమ వివరాలు నమోదు చేసుకొని విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేలా అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

**ప్రభుత్వ డైరీ మరింత బలోపేతం**

గతంలో రూ.13 వేలకు టన్ను అమ్మిన పరిస్థితి ఉందని ఈసారి దాదాపు రూ.21 వేలకు పైగా టెండర్ రేట్ వచ్చిందని చెప్పారు. ఆయిల్‌ఫెడ్‌ను మరింత బలోపేతం చేసి లాభాల దిశలో నడిపించాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ డైరీని మరింత బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. సకాలంలో పాల రైతులకు చెల్లింపులు జరపాలని సూచించారు.

## "తెలంగాణకు ఊపిరితిత్తులు ఈ రెండు జిల్లాలే"

-మొదటిపేజీ తరువాయి

జిల్లాలు గోదావరి, కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోనివే.

**ఈ అటవీ ప్రాంతం ఆందోళన కలిగిస్తోంది**

హైదరాబాద్ వంటి నగరాల్లో ఆధునిక జీవన విధానం, జనాభా పెరుగుదల, పారిశ్రామికీకరణ వల్ల ఎక్కువగా అడవులు క్షీణించిపోతున్నాయి. వాటిని పూర్తిగా లేకుండా చేస్తున్నారు. రాజధాని హైదరాబాద్? భౌగోళిక విస్తీర్ణంలో కేవలం 0.08 శాతం మాత్రమే అటవీ ప్రాంతంగా ఉంది. కరీంనగర్ పరిస్థితి మరింత ఘోరం. ఇక్కడ అటవీ విస్తీర్ణం 0.15 శాతం అంటే ప్రతి వెయ్యి ఎకరాల భూభాగంలో 1.5 ఎకరం మాత్రం అటవీ ప్రాంతం ఉంది. కరీంనగర్?లో అటవీ ప్రాంతం ఎంతలా దౌర్భాగ్య స్థితిలో ఉందో అంచనా వేసుకోవచ్చు. రాష్ట్రం మొత్తం భౌగోళిక విస్తీర్ణం 1,12,122 చ.కి.మీ. ఉంది. ఇందులో అటవీ ప్రాంతం 27,688 చ.కి.మీ. ఉంది. అటవీ విస్తీర్ణం అత్యధికంగా ఉన్న జిల్లా భద్రాద్రి కొత్తగూడెం 4,311.38 చ.కి.మీ ఉంటుంది. అత్యల్పంగా ఉన్న జిల్లా హైదరాబాద్? 1.45 చ.కి.మీ. ఉంది.

**అడవులు లేకపోవడం వల్ల కలిగే నష్టాలు**

అడవులు ప్రతి రాష్టంలో ఉండాల్సినంత విస్తీర్ణంల ఉండాలి. లేకపోతే చాలా ఇబ్బందులు ఎదుర్కొనవల్సి ఉంటుంది. వర్షపాతం సరిగ్గా ఉండదు. వానలు కురవక, పంటలు పండక ప్రజలు కరవుతో అల్లాడిపోతారు. పశుపక్ష్యాదులకు ఆధారం ఉండదు. భూగర్భజలాలు ఎండిపోతాయి. దీంతో వాతావరణం సమతుల్యతను కోల్పోతుంది. ఎండ తీవ్రత పెరిగిపోతుంది. చల్లదనం బాగా తగ్గిపోతుంది. దీంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుంది. జంతువులన్నీ మనుషులు ఉండే ప్రదేశాలకు వస్తాయి. ప్రజలు భయంకర జంతువులతో భిక్కుభిక్కుమంటూ బతకాల్సి వస్తుంది. అందువల్ల చెట్లని పెంచడం, అడవి సంపదను రక్షించడం ఎంతో అవసరం.

## తెలంగాణలో ఏసీబీ మరో రైడ్

-మొదటిపేజీ తరువాయి




ఆస్తులు కూడబెట్టిన అధికారులపై ఏసీబీ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. లాండ్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి ఇంట్లో ఏకంగా రూ.1.54 కోట్లు, కిలో బంగారంతో పాటు కీలకమైన ల్యాండ్ డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మట్నొత్తం 11 చోట్ల ఆరుగురు డీఎస్పీలు 20 మంది ఇన్‌స్పెక్టర్లతో సోదాలు నిర్వహించారు. అత్తాపూర్, మియాపూర్, గచ్చిబౌలి లాంటి ఖరీదైన ప్రాంతాల్లో బినామీ పేర్లపై ఉన్న ఓపెన్ ప్లాట్లు, విల్లాలతో పాటు, రంగారెడ్డి జిల్లాలో భారీగా వ్యవసాయ భూములకు సంబంధించిన పత్రాలను అధికారులు గుర్తించారు. ప్రస్తుతానికి ఈ సోదాల్లో దొరికిన నగదు, నగలు, డాక్యుమెంట్ల ప్రభుత్వ విలువ సుమారు రూ.5 కోట్లు ఉంటుందని, బహిరంగ మార్కెట్లో వీటి విలువ 200 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు. సోదాలు చేశామని ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. "నరహరి ఇంట్లో రూ.1.40 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నాం. ఇంత భారీ నగదు ఏసీబీ దాడుల్లో ఎప్పుడూ దొరకలేదు. నరహరి ఇంట్లో కిలో బంగారం, భూముల పత్రాలు స్వాధీనం చేసుకున్నాం. మొత్తం 11 చోట్ల ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. నగలు, ఆస్తుల విలువ రూ.5 కోట్ల వరకు ఉంటుంది. వ్యవసాయ భూములు, ప్లాట్లు, విల్లాల పత్రాలు స్వాధీనం. లాకర్లు తెరిచేందుకు బ్యాంకు అధికారులకు లేఖ రాశాం. సోదాలు పూర్తయ్యాక నరహరిని సాయంత్రం అరెస్టు చేస్తాం" ఇటీవలి కాలంలో ఇంత పెద్ద మొత్తంలో నగదు పట్టుబడటం ఏసీబీ చరిత్రలోనే సంచలనంగా మారింది. గతంలో జలమండలి జనరల్ మేనేజర్ ఇంట్లో కోటీ పది లక్షల రూపాయలు, రెండు కిలోల బంగారం పట్టుబడగా ఆర్ అడ్ బీ ఈఎన్?సీ మోహన్ నాయక్ ఇంట్లో 65 లక్షల నగదు బంగారు బిస్కెట్లు లభ్యమయ్యాయి. అయితే వాటన్నింటినీ మించి ప్రస్తుతం నరహరి ఇంట్లో ఏకంగా 1.54 కోట్ల నగదు దొరకడం సంచలనం సృష్టిస్తోంది. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయనకు వచ్చిన చట్టబద్ధమైన ఆదాయం కూడబెట్టిన స్థిరాస్తుల విలువలపై అధికారులు పక్కాగా లెక్కగడుతున్నారు. సోదాలు ఇంకా కొనసాగుతుండటంతో ఈ అవినీతి తిమింగలం అక్రమాస్తుల చిట్టా మరింత పెరిగే అవకాశం ఉంది. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు.

మన తొలివెలుగు

# మళ్లీ అఖండ కాంగ్రెస్

ప్రధాని నరేంద్ర మోదీని, ఎన్డీయే ఎదుర్కోడానికి కాంగ్రెస్ భారీ స్కెచ్ వేస్తోంది. "అఖండ కాంగ్రెస్" దిశగానే అడుగులు వేస్తోంది. ప్రాంతీయ పార్టీలను కాంగ్రెస్ లో విలీనం చేయాలన్న ప్రతిపాదనలు పంపుతోంది. దీంతో రాజకీయ సమీకరణాలు మారుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ నుంచి బయటకువెళ్లి, పార్టీలు పెట్టిన నేతలను సొంతగూటికి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలను మొదలు పెట్టింది. నేతలే కాదు, పార్టీలు సైతం విలీనానికి ప్రాథమిక దశలో సానుకూలంగా వుంటూ, చర్చలు సాగిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ లో కలిపేసి, బలమైన శక్తిగా మారాలని ఆ ప్రాంతీయ పార్టీల నేతలు ఆలోచనలో వున్నారు. ఇప్పటికే వీటికి సంబంధించిన చర్చ్లు కూడా కొనసాగుతున్నాయి.మొదట ఈ విలీన ప్రతిపాదన తృణమూల్ కాంగ్రెస్ తో ప్రారంభమైంది.బెంగాల్ లో ఓటమి పాలైన తర్వాత, మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్ లో తిరుగుబాటు బావుటా ఒక్క సారిగా పైకి వచ్చేసింది. ఏకంగా 20 మంది తాము ఎన్డీయేలో చేరేందుకు సిద్ధంగా వున్నామని ఎంపీలు ప్రకటించారు. దీంతో తృణమూల్ కాంగ్రెస్ లో వివాదం రేగింది. అలాగే అభిషేక్ బెనర్జీ చుట్టూ వివాదాలు చుట్టుకున్నాయి. అంతలోనే ఢిల్లీలో ఇండియా కూటమి సమావేశం కూడా జరిగింది. కొన్ని రోజులుగా ఇండియా కూటమి సమావేశాలకు మమతా దూరంగా వుంటూ వస్తున్నారు. ఎప్పుడైతే బెంగాల్ లో ఓడిపోయారో, ఇండియా కూటమి సమావేశానికి హాజరయ్యారు.ఇంతలోనే తృణమూల్ ను కాంగ్రెస్ లో కలిపేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. దీని ద్వారా ఇరు పార్టీలకు కూడా లాభం చేకూరుతుందని, ఇందుకు సోనియా, ప్రియాంక, రాహుల్ డీల్ చేసినట్లు కూడా వార్తలు వచ్చాయి. అంతలోనే సోనియా, మమత భేటీ కూడా జరిగింది. అంతర్గత సంక్షోభాన్ని ఎదుర్కోడానికి విలీనం చేయాలని భావించారు. గతంలో కాంగ్రెస్ నుంచి విడిపోయి పార్టీ పెట్టుకున్న వారంతా తిరిగి కాంగ్రెస్ లో విలీనం చేయాలన్న ప్రతిపాదనలు జోరందుకున్నాయి. తాజాగా మరో వార్త కూడా హల్ చల్ చేస్తోంది. ఎన్సీపీ శరద్ పవార్ కూటమి కూడా కాంగ్రెస్ లో విలీనం అయ్యే అవకాశాలు వున్నట్లు వార్తలు వస్తున్నాయి. 1999 లో కాంగ్రెస్ తో విభేదించి శరద్ పవార్ ఎన్సీపీని స్థాపించారు. సోనియా గాంధీ విదేశీయతను పవార్ ప్రశ్నించడంతో కాంగ్రెస్ బహిష్కరించింది. అలాగే సంగ్మా, తారీఖ్ అన్వర్ ను కూడా బహిష్కరించారు. వీరు ముగ్గురు కలిసి ఎన్సీపీని స్థాపించారు. టీఎంసీ మాదిరిగానే ఎన్సీపీలోనూ సంక్షోభం వుంది. అజిత్ పవార్ నాయకత్వంలో తిరుగుబాటు బావుటా ఎగరేశారు. దీంతో పార్టీ చీలిపోయింది.



అయితే విలీన ప్రతిపాదన తమ వద్దకు రాలేదని సుప్రియా సూలే ప్రకటించారు. తాము కూడా అలా అనుకోవడం లేదని ప్రకటించారు. అలాగే మరి కొందరు కూడా కాంగ్రెస్ లో విలీనం అవ్వాలని కాంగ్రెస్ ప్రతిపాదనలు పంపింది. మరో వైపు న్ని రోజులుగా తృణమూల్ పార్టీ కాంగ్రెస్ లో విలీనం అయిపోతోందన్న వార్తలు భారీగా చక్కర్లు కొడుతున్నాయి. ఈ మేరకు మమతా బెనర్జీ కాంగ్రెస్ అగ్రనేత సోనియాతో కూడా భేటీ అయ్యారు. దీంతో ఈ వార్తకు మరింత ఊతమిచ్చింది. అయితే దీనిపై కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పందించారు. విలీనంపై వస్తున్న వార్తలన్నీ పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీ ఇద్దరూ సోనియా గాంధీ, రాహుల్ గాంధీని కలిసిన మాట వాస్తవమేనని అంగీకరించారు. అది ఓ సాధారణ సమావేశమేనని స్పష్టం చేశారు. అసలు విలీనం గురించి చర్చలే జరగలేదన్నారు.కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ కార్యాచరణను స్వతంత్రంగా కొనసాగిస్తోందని, టీఎంసీ కూడా తన పార్టీ విధానాల ప్రకారమే ముందుకు సాగుతోందని తెలిపారుకాంగ్రెస్ పార్టీలో వైసీపీ విలీనం అని కొందరు లేదు ఇండియా కూటమిలో చేరి కాంగ్రెస్ తో పొత్తులు పెట్టుకుంటారు అని మరి కొందరూ ఇలా రకరకాలైన ప్రచారం చేస్తున్నారు. అయితే ఏపీలో పొలిటికల్ సన్నివేశం పూర్తిగా వేరు అని గుర్తు చేస్తున్నారు. జగన్ ఆలోచనలు ఆయన మనస్తత్వం కాంగ్రెస్ ని జగన్ వీడిన సందర్భం ఇవన్నీ గుర్తు చేసుకుంటున్న వారు మాత్రం వైసీపీ ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ లో విలీనం అయ్యే ప్రసక్తి లేదని అంటున్నారు. ఏపీలో ఈ రోజుకీ ఒంటరిగానే 40 శాతం ఓటు షేర్ ని సాధించి రేపటి ఎన్నికల్లో గెలిచే పార్టీగా ముద్ర ఉన్న వైసీపీకి కాంగ్రెస్ ని కౌగిలించుకోవడం అవసరమా అన్న ప్రశ్న కూడా రాజకీయ విశ్లేషకులు పలువురు వేస్తున్నారు.ఏపీ రాజకీయాలలో చూస్తే కనుక జగన్ ఒంటరిగానే ఉండేందుకు ఇష్టపడుతున్నారు అని అంటున్నారు. జాతీయ స్థాయిలో బీజేపీకి సందర్భానుసారం విధానాల ప్రాతిపదికన అంటూ బిల్లులకు వైసీపీ మద్దతు ఇస్తోంది. ఆ విధంగా బీజేపీ పెద్దల వద్ద వైసీపీ గుడ్ విల్ సంపాదించుకుంది. అందుకే ఏపీలో టీడీపీ కూటమి మీద ధీటుగా పోరు చేస్తోంది అని అంటున్నారు. ఇక 2029 లో బీజేపీ టీడీపీ జనసేన కూటమిగా వచ్చినా కూడా వైసీపీ ఒంటరిగానే పోరుకు సిద్ధపడుతుందని చెబుతున్నారు. జనాలు నచ్చకపోతే కూటములను అయినా ఓడిస్తారు అన్నది దేశంలో చాలా ఎన్నికలు నిరూపించాయని కూడా వైసీపీ నేతలు అంటున్నారు. పైగా వైసీపీకి చెక్కు చెదరని ఓటు బ్యాంక్ 40 పర్సెంట్ ఉందని మరో పది శాతం తెచ్చుకుంటే అధికారం సొంతం అవుతుందని కూడా లెక్క వేస్తున్నారు. ఇక 2029 ఎన్నికలు చూస్తే కచ్చితంగా ఏ కూటములకు పూర్తి స్థాయిలో మెజారిటీ దక్కే సీన్ ఉండదని కూడా అంటున్నారు. బీజేపీని మూడు సార్లు చూసిన జనాలు ఈసారి పూర్తిగా ఏకపక్షంగా నెత్తికెత్తుకోరు అని అంటున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమి బలం పెరిగినా కూడా మ్యాజిక్ ఫిగర్ కి దగ్గరగా రాలేరని అంటున్నారు. దాంతో న్యూట్రల్ గా ఉండే పార్టీలకు ఆ ఎన్నికల తరువాత డిమాండ్ పెరుగుతుందని అపుడు వైసీపీ లాంటి పార్టీలే కీలకంగా జాతీయ స్థాయిలో మారుతాయని కూడా ఫ్యాన్ పార్టీ నేతలు లెక్క వేస్తున్నారు. : ఈ క్రమంలో వైసీపీ అన్ని ఆప్షన్లూ ఓపెన్ గా ముందు పెట్టుకుంటుంది అని అంటున్నారు. అంతే తప్ప పొత్తుల పేరుతో ముందే కమిట్ అయిపోతే ఆ తరువాత కీలక నిర్ణయాలు తీసుకునే చాన్స్ కోల్పోతామని అంటున్నారు. ఏపీలో ఎలా చూసుకున్నా కాంగ్రెస్ అయితే ఈ రోజుకీ లేదని అంటున్నారు. మరో మూడేళ్ళలో కూడా అద్భుతాలు జరిగి కాంగ్రెస్ ఎదుగుతుందని కూడా ఎవరూ అనుకోవడం లేదని అంటున్నారు. అందువల్ల కాంగ్రెస్ తో పొత్తులు కానీ విలీనాలు కానీ వైసీపీకి అవసరం లేదని అంటున్నారు. పైగా జగన్ ని నాడు కాంగ్రెస్ అగ్రనాయకత్వం అవమానించిందని అందుకే బయటకు

# ఎన్డీయేకు మద్దతుగా టీఎంసీ రెబల్స్

**న్యూఢిల్లీ :** జాతీయ రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనే నగ్న సత్యాన్ని నిరూపిస్తూ పశ్చిమ బెంగాల్ అధికార పక్షం తృణమూల్ కాంగ్రెస్ కు చెందిన సుమారు 20 మంది రెబల్ ఎంపీలు కేంద్రంలోని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి మద్దతు ప్రకటించడం సరికొత్త సంచలనానికి తెరలేపింది. వారు ఎన్డీయేలో అధికారికంగా విలీనమవుతారా లేక బయట నుండి మద్దతు ఇస్తారా అనేది పక్కన పెడితే.. కేంద్ర ప్రభుత్వానికి 20 మంది ఎంపీల అదనపు బలం లభించడం ఖాయమైంది. ఈ పరిణామం ఢిల్లీ పీఠాన్ని మరింత సుస్థిరం చేయడమే కాకుండా, కూటమిలోని ఇతర ప్రాంతీయ పార్టీలపై, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడి ప్రాధాన్యతపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్న దానిపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. కేంద్రంలో బీజేపీకి సొంతంగా పూర్తి మెజారిటీ లేని ప్రస్తుత పరిస్థితుల్లో, ప్రభుత్వ మనుగడకు చంద్రబాబు , నితీష్ కుమార్ అత్యంత కీలకంగా మారారు. కింగ్ మేకర్లుగా ఉన్న వీరిద్దరి డిమాండ్లకు లొంగుతూనే మోదీ–షా ద్వయం ఇన్నాళ్లూ బండిని లాగాల్సి వచ్చింది. అయితే, ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్ నుంచి ఊహించని విధంగా 20 మంది ఎంపీల మద్దతు లభించడంతో కేంద్రంలో ఎన్డీయే నెంబర్ గేమ్ పూర్తిగా మారిపోయింది. చంద్రబాబు , నితీష్ కుమార్ లలో ఎవరైనా ఒకరు మద్దతు ఉపసంహరించుకున్నా ప్రభుత్వానికి ఎలాంటి ఢోకా ఉండదనే బలమైన భరోసా ఇప్పుడు బీజేపీ అధిష్టానానికి దక్కింది. ఈ సమీకరణం సహజంగానే కూటమిలో బీజేపీ బేరసారాల శక్తిని పెంచుతుంది. లోక్‌సభలో అదనంగా 20 మంది ఎంపీల బలం తోడవడంతో.. మిత్రపక్షాల వీటో పవ గణనీయంగా తగ్గింది. ఇది మోదీ, అమిత్ షాలకు రాజకీయంగా పెద్ద ఊరట.ఈ అనుమానాలు రాజకీయ వర్గాల్లో తలెత్తుతున్నాయి. చంద్రబాబు ప్రాధాన్యత పూర్తిగా తగ్గిపోతుందని చెప్పలేం కానీ, గతంలో ఉన్నంత లీవరేజ్ మాత్రం ఇకపై ఉండకపోవచ్చు. రాష్ట్రానికి సంబంధించిన ప్రత్యేక నిధులు, పోలవరం బడ్జెట్, అమరావతి గ్రాంట్ల విషయంలో చంద్రబాబు కేంద్రంపై గతంలో చూపించినంత ఒత్తిడిని ఇకపై ప్రదర్శించడం అంత సులువు కాదు. ఎందుకంటే, కేంద్రంపై ఒత్తిడి మితిమీరితే.. ప్రత్యామ్నాయంగా తమకు





టీఎంసీ ఎంపీల మద్దతు ఉందనే సంకేతాన్ని మోదీ, షా ఇవ్వడానికి వెనుకాడరు. అయితే, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల దీర్ఘకాలిక ఆలోచనలు వేరేలా ఉన్నాయి. వారు చంద్రబాబును అంత తేలికగా దూరం చేసుకోరని ఇండస్ట్రీ ఇన్సైడర్స్ అభిప్రాయపడుతున్నారు. చంద్రబాబు నమ్మకమైన, క్రమశిక్షణ కలిగిన మిత్రపక్షంగా ఉన్నారు. దానికి భిన్నంగా, పశ్చిమ బెంగాల్ నుంచి వస్తున్న టీఎంసీ ఎంపీల మద్దతు తాత్కాలిక అవసరాల కోసమో, మమతా బెనర్జీతో విభేదాల వల్లో పుట్టుకొచ్చిందే తప్ప, సిద్ధాంతపరమైనది కాదు. రేపు ఏదైనా తేడా వస్తే వారు మళ్లీ ప్లేట్ మార్చే ప్రమాదం ఉంది. కాబట్టి, నమ్మకమైన చంద్రబాబును పూర్తిగా పక్కన పెట్టి, అస్థిరమైన టీఎంసీ శ్రేణులపై బీజేపీ పూర్తిగా ఆధారపడే సాహసం చేయదు. ఈ జాతీయ పరిణామాలు ఆంధ్రప్రదేశ్ అంతర్గత రాజకీయాలపై కూడా ఖచ్చితంగా ప్రభావం చూపిస్తాయి. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే ఈ అంశాన్ని అస్త్రంగా మార్చుకునే ప్రయత్నం చేస్తోంది. ఇకపై ఢిల్లీలో చంద్రబాబును మోదీ ప్రభుత్వం పట్టించుకోదు అంటూ ఇప్పటి నుంచే ప్రచారం ప్రారంభించింది. అయితే, చంద్రబాబుకు ఉన్న ఇమేజ్, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆయనకు ఉన్న విజన్ దృష్ట్యా.. ఆయన కేంద్రంతో ఘర్షణ వైఖరి పెట్టుకోకుండా, మరింత చాకచక్యంగా దౌత్యనీతిని ఉపయోగించి ఏపీకి రావలసిన హక్కులను సాధించుకుంటారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. టీఎంసీ ఎంపీల మద్దతు వల్ల ఎన్డీయే కూటమిలో బీజేపీ సీటు కాస్త గట్టిపడిందనేది పచ్చి నిజం. చంద్రబాబుపై ఆధారపడే పరిస్థితి గతంతో పోలిస్తే మోదీ–షాలకు కాస్త తగ్గింది. కానీ, పారదర్శకమైన పాలనలో చంద్రబాబు వంటి సీనియర్ లీడర్ భాగస్వామ్యం ఎన్డీయే ప్రభుత్వానికి జాతీయ స్థాయిలో ఒక బ్రాండ్ వాల్యూని ఇస్తుంది. కాబట్టి చంద్రబాబు హోదాను తగ్గించడం కంటే.. మిత్రపక్షాలన్నింటినీ సమతూకం చేస్తూనే, తమ సొంత ఎజెండాను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లడానికే మోదీ–షా ద్వయం ఈ కొత్త నెంబర్లను వాడుకునే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

# జెన్‌కోను ముంచే టెండర్ తగదు

తెలంగాణ విద్యుత్తు ఉత్పత్తి రంగంలో కీలక సంస్థగా ఉన్న టీజీజెన్కోలో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్)కు సంబంధించిన రూ.255 కోట్ల విలువైన ఏహెచ్‌పీ (ూంష్ర ఝఅన్రీఱఅష్ర్శాశ్రీఝత్), సీహెచ్‌పీ (జశ్ఝశ్రీ ఝఅన్రీఱఅష్ర ్శాశ్రీఝత్) ఆపరేషన్, మెయింటెనెన్స్ టెండర్ తీవ్ర చర్చకు దారి తీస్తున్నది. మూడేండ్ల కాలానికి ప్రతిపాదించిన ఈ టెండర్ కేవలం మానవవనరుల కొరతను భర్తీ చేసే చర్య మాత్రమే కాకుండా, సంస్థలోని కీలక ఇంజినీరింగ్ బాధ్యతలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నమనే అభిప్రాయం ఇంజినీరింగ్ వర్గాల్లో వ్యక్తమవుతున్నది. ఏహెచ్‌పీ, సీహెచ్‌పీ అనేవి విద్యుత్తు ఉత్పత్తి ప్రక్రియలో అంతర్భాగాలు. బొగ్గు బంకర్లకు చేరకపోతే విద్యుత్తు ఉత్పత్తి ఆగిపోతుంది. బూడిదను తరలించకపోతే యూనిట్ల నిర్వహణ, పర్యావరణ అనుమతులు, ఉత్పత్తి సామర్థ్యం దెబ్బతింటాయి. ఇలాంటి కీలక వ్యవస్థల నిర్వహణ, ఆపరేషన్, ఎలక్ట్రికల్, మెకానికల్, సీ అండ్ ఐ, డీసీఎస్, పీఎల్‌సీ, ట్రబుల్ షూటింగ్, బ్రేక్‌డౌన్ మెయింటెనెన్స్ వంటి బాధ్యతలను పూర్తిగా కాంట్రాక్టర్‌కు అప్పగించటం వల్ల సంస్థ భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని ఇంజినీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టీజీజెన్కోలో ఇంజినీర్లు ప్లాంట్‌ను కేవలం రోజువారీ ఆపరేషన్ కోణంలో కాకుండా, దీర్ఘకాలిక ఆస్తిగా చూస్తారు. వేల కోట్ల రూపాయల విలువైన యంత్రాల జీవితకాలం, విశ్వసనీయత, భవిష్యత్ పనితీరు, బలహీనతలు, మూలకారణాల విశ్లేషణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. అయితే కాంట్రాక్టర్ ప్రధాన లక్ష్యం కాంట్రాక్ట్ కాలంలో పనిని పూర్తిచేయటమే. యంత్రాల 20–30 సంవత్సరాల జీవితకాలం, భవిష్యత్ పనితీరు, మూల కారణాల నివారణ వంటి అంశాలపై అదే స్థాయి బాధ్యతాభావం ఉండకపోవచ్చని ఇంజినీర్లు పేర్కొంటున్నారు. పరికరం చెడిపోతే దాని ప్రభావాన్ని దశాబ్దాల పాటు భరించేది జెన్‌కో. కానీ కాంట్రాక్టర్ బాధ్యత కాంట్రాక్ట్ ముగిసే వరకే ఉంటుందని పలువురు సీనియర్ ఇంజినీర్లు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఏహెచ్‌పీ, సీహెచ్‌పీల నిర్వహణ ద్వారా అసిస్టెంట్ ఇంజినీర్లు, ఏడీఈలు, డీఈలు ప్రాక్టికల్ అనుభవాన్ని సంపాదిస్తున్నారు. కన్వేయర్లు, వ్యాగన్ టిప్లర్లు, క్రషర్లు, స్టాకర్ రిక్లైమర్లు, పీఎల్‌సీలు, డీసీఎస్‌లు, ఇన్‌స్ట్రుమెంటేషన్ వ్యవస్థలపై లోతైన అవగాహన పొందుతున్నారు. రానున్న రోజుల్లో ఈ బాధ్యతలన్నీ కాంట్రాక్టర్‌కు వెళ్లిపోతే రాబోయే తరాల ఇంజినీర్లకు నేర్చుకునే అవకాశాలు తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తమవుతున్నది. ఫలితంగా టీజీజెన్‌కోలో సాంకేతిక నైపుణ్యం క్రమంగా తగ్గిపోవచ్చని భావిస్తున్నారు.

ఈ టెండర్‌పై ఇంజినీర్ల ప్రధాన అభ్యంతరం ప్రమోషన్ల భవిష్యత్తు. ప్రస్తుతం అసిస్టెంట్ ఇంజనీర్ నుంచి ఏడీజీ, డీజీ, ఎస్ఈ, సీఈ స్థాయిలకు ఎదగటానికి అవసరమైన ఫీల్డ్ అనుభవం, సాంకేతిక పరిజ్ఞానం, ఆపరేషనల్ నాయకత్వం ఈ విభాగాల ద్వారా లభిస్తున్నది. ఏహెచ్‌పీ, సీహెచ్‌పీ వంటి ప్రధాన విభాగాలు పూర్తిగా అవుట్‌సోర్స్ అయితే భవిష్యత్ ఇంజినీర్లు కేవలం కాంట్రాక్ట్ మానిటరింగ్ అధికారులుగా మారే ప్రమాదం ఉన్నదని ఉద్యోగ సంఘాలు హెచ్చరిస్తున్నాయి. టీజీజెన్కోలో ఇప్పటికే కొన్నేళ్లుగా పెద్ద ఎత్తున నియామకాలు జరుగలేదని ఉద్యోగ సంఘాలు చెప్తున్నాయి. ప్రస్తుతం ఉన్న ఖాళీలను భర్తీ చేయకుండా అవుట్‌సోర్సింగ్‌ను ప్రోత్సహిస్తే భవిష్యత్‌లో కొత్త భర్తీల అవసరం లేదనే వాదన బలపడే అవకాశం ఉన్నదని వారు అంటున్నారు. ఇది యువ ఇంజినీర్ల ఉద్యోగ అవకాశాలను దెబ్బతీయటమే కాకుండా, సంస్థలో శాశ్వత సాంకేతిక సిబ్బంది సంఖ్యను క్రమంగా తగ్గించే ప్రమాదాన్ని కలిగిస్తుందని పేర్కొంటున్నారు.

మూడేండ్లకు రూ.255 కోట్ల వ్యయం అంటే సంవత్సరానికి సుమారు రూ.85 కోట్ల ఖర్చు. ఇదే మొత్తాన్ని సిబ్బంది హేతుబద్ధీకరణ, ఖాళీల భర్తీ, ప్రమోషన్లు, సాంకేతిక శిక్షణలపై వినియోగిస్తే సంస్థకు శాశ్వత ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ముఖ్యంగా టీజీజెన్కోలో ఇప్పటికే మానవవనరుల హేతుబద్ధీకరణపై కమిటీని నియమించిన నేపథ్యంలో, ఆ కమిటీ నివేదిక రాకముందే ఇంత భారీ అవుట్‌సోర్సింగ్ ఒప్పందం చేపట్టటం సరైందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఉద్యోగ సంఘాలు వ్యక్తం చేస్తున్న అత్యంత పెద్ద ఆందోళన ఏమిటంటే.. ఇది కేవలం ఏహెచ్‌పీ, సీహెచ్‌పీలకే పరిమితం కాకపోవచ్చు. ఈరోజు బొగ్గు, బూడిద నిర్వహణను అవుట్‌సోర్స్ చేస్తే రేపు డీఎం ప్లాంట్, వాటర్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్, బాయిలర్ ఆక్సిలరీలు, టర్బన్ ఆక్సిలరీలు, చివరకు ఉత్పత్తి కార్యకలాపాలే ప్రైవేట్ సంస్థలకు వెళ్లే ప్రమాదం ఉన్నదని వారు హెచ్చరిస్తున్నారు. ప్రైవేటీకరణ ఒక్కరోజులో జరగదు. ముందుగా విభాగాల అవుట్‌సోర్సింగ్, తర్వాత కీలక కార్యకలాపాల బదిలీ, ఆపై సంస్థ అంతర్గత సామర్థ్యం క్షీణించటం ద్వారా క్రమంగా జరుగుతుందని ఉద్యోగ సంఘాల వాదన.

ఇంజినీర్ల సంఘాలు స్పష్టం చేస్తున్నది ఒక్కటే. వైటీపీఎస్‌లో మానవ వనరుల కొరత వాస్తవమే. అయితే దానికి పరిష్కారం అవుట్‌సోర్సింగ్ కాదని, హేతుబద్ధీకరణ, నియామకాలు, పెండింగ్ ప్రమోషన్లు, సాంకేతిక సిబ్బంది బలోపేతమేనని వారు చెబుతున్నారు. జెన్‌కో భవిష్యత్తు, ఇంజినీర్ల కెరీర్ పురోగతి, సంస్థ సాంకేతిక స్వావలంబన, రాష్ట్ర విద్యుత్తు ఉత్పత్తి భద్రత దృష్ట్యా ఏహెచ్‌పీ, సీహెచ్‌పీ వంటి కీలక విభాగాలు టీజీజెన్కో ఇంజినీర్ల ఆధ్వర్యంలోనే కొనసాగాలని వారు డిమాండ్ చేస్తున్నారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు సంబంధించిన ఈ టెండర్ ఇప్పుడు కేవలం ఒక పరిపాలనా నిర్ణయం మాత్రమే కాదు. ఇది టీజీజెన్కో భవిష్యత్తు, ఇంజినీరింగ్ క్యాడర్ స్థిరత్వం, భవిష్యత్ నియామకాలు, ప్రమోషన్లు, సాంకేతిక స్వతంత్రత, ప్రభుత్వ రంగ విద్యుత్తు ఉత్పత్తి సంస్థల దిశను నిర్ణయించే కీలక అంశంగా మారింది.

# ఉద్ధవ్ శివసేనలో మరో చీలిక

మహారాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా అలజడి రేగింది. అంతా బాగుంటుందనుకున్న సమయంలో మాజీ సీఎం, శివసేన (యూబీటీ) ఉద్ధవ్ ఠాక్రే కి సొంత పార్టీ ప్రజా ప్రతినిధులే షాక్ ఇచ్చారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, శివసేన నుంచే విడిపోయిన వేరు కుంపటి పెట్టుకున్న ఏకనాథ్ షిండేతో ఉద్ధవ్ వర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు రహస్యంగా భేటీ అయ్యారు. దీంతో ఉద్ధవ్ ఠాక్రేకి ఝలక్ తగిలినట్లైంది.దీంతో ఉద్ధవ్ వెంటనే అలర్ట్ అయ్యారు. తన నివాసంలో తన వర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులందరితో కీలక సమావేశం నిర్వహిస్తున్నారు. తన పార్టీ చీలుతోందన్న గట్టి అనుమానం రావడంతో వెంటనే కీలక సమావేశం నిర్వహిస్తున్నారు. ఆపరేషన్ టైగర్"లో భాగంగా, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలోకి కొందరు ఎంపీలు మారవచ్చున్న ఊహాగానాల మధ్య ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే.. ఈ భేటీలో రాజకీయం లేదని, అంత ప్రాధాన్యత భేటీ కూడా కాదని డిప్యూటీ సీఎం షిండే కొట్టిపారేశారు.అయితే, మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ లోని అసమ్మతి వర్గం బీజేపీకి మద్దతు ప్రకటించడంతో, కేంద్రంలో రాజకీయ సమీకరణాలు గణనీయంగా మారే అవకాశం ఉంది. తమకు 20 మంది ౨ఓఅ ఎంపీల మద్దతు ఉందని ఆ అసమ్మతి వర్గం పేర్కొంటోంది.ఈ భయం కూడా ఉద్ధవ్ కి వున్నట్లు పుకార్లు వస్తున్నాయి.మహారాష్ట్రలో కొత్త




రాజకీయ పరిణామాలకు సంబంధించిన ఊహాగానాలు జోరుగా సాగుతున్న నేపథ్యం లో, ఈ సమావేశాన్ని ఆ సంస్థ యొక్క విశ్వసనీయతను మరియు అంతర్గత ఐక్యతను అంచనా వేసే ప్రయత్నంగా భావిస్తున్నారు; ఎందుకంటే,యూబీటీకి చెందిన తొమ్మిది మంది లోక్‌సభ సభ్యులలో ఏడుగురు షిండేతో సంప్రదింపులు జరుపుతున్నారని మరియు శివసేనలో చేరడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారని వార్తలు వస్తున్నాయి.జూన్ 7న న్యూఢిల్లీలో షిండేతో ఆ ఎంపీలు సమావేశమయ్యారని, అప్పుడు వారికి శివసేనలో చేరే ప్రతిపాదన చేశారని సమాచారం. ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తూ, 'ఆపరేషన్ టైగర్' దాదాపు పూర్తయ్యే దశకు చేరుకుందని కేంద్ర మంత్రి మరియు శివసేన ఎంపీ ప్రతాప్‌రావు జాదవ్ ప్రకటించారు.ప్రస్తుతం లోక్‌సభలో షిండే నేతృత్వంలోని శివసేనకు ఏడుగురు సభ్యులు ఉన్నారు; భారతీయ జనతా పార్టీ, తెలుగుదేశం పార్టీ మరియు జనతాదళ్ (యునైటెడ్) తర్వాత నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్లో ఇది మూడవ అతిపెద్ద భాగస్వామ్య పక్షంగా ఉంది.ఒకవేళ యూబీటీ కి చెందిన ఏడుగురు ఎంపీలు షిండే సేనలో చేరాలని నిర్ణయించుకుంటే, అది పార్టీ చీలికకు దారితీయడంతో పాటు దిగువ సభలో ఔఅం బలాన్ని పెంచుతుంది.

## జిల్లెలగూడ చందన చెరువును డంపింగ్ యార్డ్ గా మార్చారు



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య ముదిరాజ్ :** చందన చెరువును జీహెచ్ఎంసీ అధికారులు డంపింగ్ యార్డ్ గా మార్చారని మీర్ పేట్ మాజీ బీ.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆర్కల కామేష్ రెడ్డి మండిపడ్డారు. జీ హెచ్ఎంసీ బడంగ్ పేట్ సర్కిల్ – 16 పరిధిలోని జిల్లెలగూడ చందన చెరువు చుట్టు ప్రక్కల కాలనీ వాసులు అక్కడికి వచ్చే మార్నింగ్ వాకర్స్ చేసిన విజ్ఞప్తి మేరకు ఆయన చెరువును సందర్శించారు. చెరువులో నుండి తీసిన గుర్రపు డెక్కను తీసే కార్యక్రమాన్ని గత నెల రోజుల క్రితం నుండి చేపడుతున్న పనుల్లో భాగంగా వాకింగ్ చేసే వాకర్స్ ట్రాక్ పైన వేశారన్నారు. తీసిన గుర్రపు డెక్కను తరలించలేదని, ఎక్కడ వేసిన గొంగడి అక్కడ అన్న చందంగా.. చెరువులో నుండి తీసి పక్కకు పోసి తరలించకుండా వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సిద్దాల భరత్, వాకర్స్, చుట్టు ప్రక్కల కాలనీ వాసులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కామేష్ రెడ్డి మాట్లాడుతూ.. అధికారులు అలసత్వంతో, సమన్వయలోపంతో మొద్దు నిద్ర పోతూ ప్రజల నుండి వసూలు చేస్తున్న అధిక ఇంటి పన్నులను ఎలాంటి జవాబుదారీతనం లేకుండా ప్రజలకు కలుగుతున్న ఇబ్బందిని ప్రశ్నించగా.. మాకేం పట్టనట్టుగా అధికారుల తీరు ఉందన్నారు. అక్కడ జేసీబీ పైన పని చేసేటువంటి వారిని ప్రశ్నించగా గత 20 రోజుల నుండి ఇక్కడ ఎలాంటి పనులు చేయటం లేదని వారు తెలిపారన్నారు. ఒక వారం రోజులలో ఇక్కడ ఉన్నటువంటి గుర్రపు డెక్కను తొలగించకపోతే చెరువు బయట రోడ్డు పైన బైఠాయించి 1000 మంది వాకర్స్ తో ధర్నా చేస్తామని హెచ్చరించారు. అధికారుల మొద్దు నిద్రతోనా.. లేక ప్రభుత్వ వైఫల్యంతోనో అర్థం కావడం లేదని, కానీ సర్వాంగ సుందరంగా ఉన్న చెరువును డంపింగ్ యార్డ్ లాగా తయారు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారుల వైఖరి ఇలానే ఉన్నట్లయితే తరువాత చర్యలు ఇంకా తీవ్ర స్థాయిలో ఉంటాయని, దీన్ని ఉద్యమంలాగా ముందుకు తీసుకెళ్తామని హెచ్చరించారు.

## విద్యార్థుల ఆరోగ్యం భద్రతకు ప్రాధాన్యతనివ్వాలి

విద్యా శాఖ అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి
హుస్నేనాబాద్ కేజీబీవీని పరిశీలించిన జిల్లా కలెక్టర్



**మన తొలి వెలుగు, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో ప్రతినిధి జంగిటి రవీందర్ :** భువనగిరి పట్టణ పరిధిలోని హుస్నేనాబాద్‌లో ఉన్న కస్తూర్బా గాంధీ బాలిక పాఠశాల (కేజీబీవీ) ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించి జరిగిన అడ్మిషన్ల వివరాలను కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎన్ని కొత్త అడ్మిషన్లు వచ్చాయని , విద్యార్థినుల హాజరు శాతం ఎలా ఉందని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో కొనసాగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. పనులు నెమ్మదిగా సాగుతున్న విషయంపై ఆరా తీసిన కలెక్టర్, ఆలస్యానికి గల కారణాలను తెలుసుకుని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. పాఠశాల స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్, అక్కడ నిల్వ ఉంచిన బియ్యం, పప్పు కూరగాయలు నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న ఆహారం నాణ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే వంట నూనె ప్యాకెట్లపై ఉన్న గడువు తేదీలను పరిశీలించి, కాలపరిమితి ముగిసిన వస్తువులు వినియోగించరాదని సూచించారు. పాఠశాల ఆవరణను పరిశీలించిన కలెక్టర్, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా, చెత్తాచెదారం పేరుకుపోకుండా పరిశుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థినుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి బిక్షపతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జిల్లెలగూడ చందన చెరువును డంపింగ్ యార్డ్ గా మార్చారు



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య ముదిరాజ్ :** చందన చెరువును జీహెచ్ఎంసీ అధికారులు డంపింగ్ యార్డ్ గా మార్చారని మీర్ పేట్ మాజీ బీ.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆర్కల కామేష్ రెడ్డి మండిపడ్డారు. జీ హెచ్ఎంసీ బడంగ్ పేట్ సర్కిల్ – 16 పరిధిలోని జిల్లెలగూడ చందన చెరువు చుట్టు ప్రక్కల కాలనీ వాసులు అక్కడికి వచ్చే మార్నింగ్ వాకర్స్ చేసిన విజ్ఞప్తి మేరకు ఆయన చెరువును సందర్శించారు. చెరువులో నుండి తీసిన గుర్రపు డెక్కను తీసే కార్యక్రమాన్ని గత నెల రోజుల క్రితం నుండి చేపడుతున్న పనుల్లో భాగంగా వాకింగ్ చేసే వాకర్స్ ట్రాక్ పైన వేశారన్నారు. తీసిన గుర్రపు డెక్కను తరలించలేదని, ఎక్కడ వేసిన గొంగడి అక్కడ అన్న చందంగా.. చెరువులో నుండి తీసి పక్కకు పోసి తరలించకుండా వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సిద్దాల భరత్, వాకర్స్, చుట్టు ప్రక్కల కాలనీ వాసులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కామేష్ రెడ్డి మాట్లాడుతూ.. అధికారులు అలసత్వంతో, సమన్వయలోపంతో మొద్దు నిద్ర పోతూ ప్రజల నుండి వసూలు చేస్తున్న అధిక ఇంటి పన్నులను ఎలాంటి జవాబుదారీతనం లేకుండా ప్రజలకు కలుగుతున్న ఇబ్బందిని ప్రశ్నించగా.. మాకేం పట్టనట్టుగా అధికారుల తీరు ఉందన్నారు. అక్కడ జేసీబీ పైన పని చేసేటువంటి వారిని ప్రశ్నించగా గత 20 రోజుల నుండి ఇక్కడ ఎలాంటి పనులు చేయటం లేదని వారు తెలిపారన్నారు. ఒక వారం రోజులలో ఇక్కడ ఉన్నటువంటి గుర్రపు డెక్కను తొలగించకపోతే చెరువు బయట రోడ్డు పైన బైఠాయించి 1000 మంది వాకర్స్ తో ధర్నా చేస్తామని హెచ్చరించారు. అధికారుల మొద్దు నిద్రతోనా.. లేక ప్రభుత్వ వైఫల్యంతోనో అర్థం కావడం లేదని, కానీ సర్వాంగ సుందరంగా ఉన్న చెరువును డంపింగ్ యార్డ్ లాగా తయారు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారుల వైఖరి ఇలానే ఉన్నట్లయితే తరువాత చర్యలు ఇంకా తీవ్ర స్థాయిలో ఉంటాయని, దీన్ని ఉద్యమంలాగా ముందుకు తీసుకెళ్తామని హెచ్చరించారు.

## విద్యార్థుల ఆరోగ్యం భద్రతకు ప్రాధాన్యతనివ్వాలి

విద్యా శాఖ అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి
హుస్నేనాబాద్ కేజీబీవీని పరిశీలించిన జిల్లా కలెక్టర్



**మన తొలి వెలుగు, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో ప్రతినిధి జంగిటి రవీందర్ :** భువనగిరి పట్టణ పరిధిలోని హుస్నేనాబాద్‌లో ఉన్న కస్తూర్బా గాంధీ బాలిక పాఠశాల (కేజీబీవీ) ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించి జరిగిన అడ్మిషన్ల వివరాలను కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎన్ని కొత్త అడ్మిషన్లు వచ్చాయని , విద్యార్థినుల హాజరు శాతం ఎలా ఉందని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో కొనసాగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. పనులు నెమ్మదిగా సాగుతున్న విషయంపై ఆరా తీసిన కలెక్టర్, ఆలస్యానికి గల కారణాలను తెలుసుకుని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. పాఠశాల స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్, అక్కడ నిల్వ ఉంచిన బియ్యం, పప్పు కూరగాయలు నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న ఆహారం నాణ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే వంట నూనె ప్యాకెట్లపై ఉన్న గడువు తేదీలను పరిశీలించి, కాలపరిమితి ముగిసిన వస్తువులు వినియోగించరాదని సూచించారు. పాఠశాల ఆవరణను పరిశీలించిన కలెక్టర్, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా, చెత్తాచెదారం పేరుకుపోకుండా పరిశుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థినుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి బిక్షపతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ స్కూళ్లను అంగన్ వాడి కేంద్రాలకే అప్పగించాలి

ప్రతి నెల ఒకటో తేదీన అంగన్వాడీలకు వేతనాలు చెల్లించాలి
తెలంగాణ అంగన్వాడి టీచర్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు దాసరి పండు



**మన తొలివెలుగు, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో ప్రతినిధి జంగిటి రవీందర్ :** రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి టీచర్ల, ఆయాల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రీ ప్రైమరీ స్కూల్స్ అంగన్ వాడి కేంద్రానికి అప్పగించాలని అంగన్ వాడి టీచర్లకు, హెల్పర్లకు ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలని తెలంగాణ అంగన్ వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు దాసరి పాండు డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటియూ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంగన్ వాడిల సమస్యలను పరిష్కరించాలి ప్రీ ప్రైమరీ స్కూళ్లను అంగన్ వాడి కేంద్రాలకు అప్పగించాలని కోరుతూ జిల్లా కేంద్రంలో ఉన్న గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్వాడిల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉన్నదని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా రాష్ట్రంలో అంగన్ వాడి టీచర్లకు హెల్పర్లకు గ్రాడ్యుటి అమలు చేయాలని పెండింగ్లో ఉన్న రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని ఏలాంటి షరతులు లేకుండా ఆసరా పెన్షన్ అమలు చేయాలని కేంద్ర శిశు సంక్షేమ శాఖ ఆదేశాల ప్రకారం బిఎల్ఓ డ్యూటీలు రద్దు చేయాలని ఐసిడిఎస్ కు సంబంధం లేని అదనపు పనులు చేయించకూడదని కొత్తగా ఇచ్చిన సెల్ ఫోన్లో పని చేయట్లేదని వీటిని వెంటనే వెనక్కి తీసుకోవాలని అన్ని యాప్స్ మరియు సౌకర్యాలతో 5 జీ నెట్వర్క్ ఫోన్స్ ఇవ్వాలని సీనియార్టీని బట్టి ఇంక్రిమెంట్ నిర్ణయించాలని మంత్రిగారి హామీ ప్రకారంగా కారుణ్య నియామకాలు త్వరలో నిర్ణయించాలని అంగన్వాడి టీచర్స్ హెల్పర్స్ కు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అమలు చేయాలని అంగన్వాడి కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని మౌలిక వసతులు కల్పించాలని ఏళ్ల తరబడిగా పనిచేస్తున్న అంగన్వాడి లను పక్కన పెట్టే కొత్తగా తీసుకొస్తున్న ప్రి ప్రైమరీ స్కూళ్లలో నూతనంగా టీచర్లను ఆయన పెట్టి అంగన్ వాడి టీచర్లను ఆయాలను ఉద్యోగ భద్రత లేకుండా చేస్తుందని ఇలాంటి విధానాలకు వ్యతిరేకంగా అంగన్వాడీ టీచర్లు ఆయాలు ఉద్యమాలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మాయ కృష్ణ, అంగన్ వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సీ.హెచ్ రామకుమారి, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

## వీహెచ్‌కు జన్మదిన శుభాకాంక్షలు

**తెలిపిన భువనగిరి చైర్‌పర్సన్ తంగళ్ల పల్లి శ్రీవాణి రవి కుమార్ దంపతులు**



**మన తొలివెలుగు, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో ప్రతినిధి జంగిటి రవీందర్ :** మాజీ రాజ్యసభ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బీసీ సలహాదారు వీ. హనుమంతరావు జన్మదినం సందర్భంగా భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగెళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, పీసీసీ డెలిగేట్ తంగెళ్ళపల్లి రవికుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏనుగు ధర్మా రెడ్డి, నక్కల అది నారాయణ, కూర శివకుమార్, మైనారిటీ నాయకులు రఫీ ఉద్దీన్, గౌరీ, వినయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**సూదుల సంపత్ గౌడ్ డిమాండ్**



**మన తొలివెలుగు, కుత్బుల్లాపూర్ ప్రతినిధి టి.రమేష్ :** కుత్బుల్లాపూర్ జీడిమెట్ల డివిజన్ పరిధిలోని కాలనీలలో నెలకొన్న తీవ్ర ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.ఎన్ రెడ్డి కాలనీ ఫేజ్-1 వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సూదుల సంపత్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రస్తుత పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల కాలనీల నిర్వహణ పూర్తిగా గాలికొదిలేశారని విమర్శించారు. మురుగునీరు రోడ్లపై పారుతోందని, త్రాగునీరు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పైప్‌లైన్ పనుల కోసం తవ్విన రోడ్లను పూడ్చకపోవడంతో గుంతలమయంగా మారి వాహనదారులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. చెత్త సేకరణ సక్రమంగా జరగడంలేదని, ఫాగింగ్ లేకపోవడంతో దోమల ఉధృతి పెరిగి డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలుతున్నాయని పేర్కొన్నారు. వారానికి ఒకసారి మాత్రమే తక్కువ ప్రెజర్‌తో నీరు వస్తోందని, వీధి దీపాలు వెలగకపోవడం వల్ల రాత్రి వేళల్లో మహిళల భద్రతకు ముప్పు పొంచి ఉందని అన్నారు. అధికారులు స్పందించి పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, లేనిపక్షంలో కాలనీ ప్రజలతో కలిసి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని సంపత్ గౌడ్ హెచ్చరించారు.

## స్థానిక సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా వివిధ అభివృద్ధి పనులు





**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య ముదిరాజ్ :** స్థానిక సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. జల్ పల్లి సర్కిల్, జీహెచ్ఎంసీ 63వ డివిజన్ పరిధిలోని షాహీనగర్, కొత్తపేట్, నబీల్ కాలనీ, కొత్తపేట్ వాటర్ ట్యాంక్ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న వర్షపు నీరు, డ్రైనేజ్, రోడ్లు, తాగునీటి సమస్యల పరిష్కారం కోసం రూ. 2 కోట్ల 25 లక్షల నిధులతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జల్ పల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వెంకట్రావుతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొత్తపేట్ నబీల్ కాలనీలో వర్షపు నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేలా దశలవారీగా నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించామని తెలిపారు. ఇప్పటికే అనేక పనులు పూర్తికాగా, మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఈ ప్రాంతంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని, ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జల్ పల్లి సర్కిల్‌లో ఇప్పటికే వాటర్ లైన్లు, డ్రైనేజ్ వ్యవస్థ, స్ట్రీట్ లైట్లు, రోడ్ల అభివృద్ధి పనులకు భారీగా నిధులు వెచ్చించామని, నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించేలా అధికారులతో సమన్వయం చేస్తున్నామని చెప్పారు. అదేవిధంగా షాహీనగర్, కొత్తపేట్, నబీల్ కాలనీ, కొత్తపేట్ వాటర్ ట్యాంక్ ప్రాంతాల్లో సీసీ రోడ్ల పనులను తక్షణమే ప్రారంభించి, సానిటేషన్, డ్రైనేజ్, తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన బాధ్యత అని అభివృద్ధే తన సంకల్పం అని తెలిపారు.

**జీహెచ్ఎంసీ అధికారులు పారిశుధ్యం పై ప్రత్యేక డ్రైవ్ కొనసాగించాలి**

ప్రస్తుతం వర్షాకాలంలో ప్రజలు వివిధ అనారోగ్యాల బారిన పడకుండా కాలనీలలో, బస్తీలలో ఎప్పటికప్పుడు చెత్తాచెదారం తీసివేయాలని, మురుగు కాలువలను శుభ్రం చేయించాలని జీహెచ్ఎంసీ, అధికారులకు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. తాను ఎప్పుడైనా ఉదయం 6 గంటల సమయంలో అకస్మాత్తుగా పర్యవేక్షణ చేస్తానని కాలనీ, బస్తీల్లో పేర్కొని పోయిన చెత్త తీయకుండా ఉంటే అధికారులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జల్ పల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వెంకట్ రామ్, నాయకులు అబ్దుల్లా సాది, అబ్దుల్లా బిన్ గాలిబ్, షేక్ అఫ్జల్, యంజాల జనార్ధన్, యంజాల అర్జున్, మన్సూర్ అలీ, బర్కత్ అలీ, వెంకట్ రాజిరెడ్డి, ఆరిఫ్ అలీ, ఖరీం, నాగేష్ ముదిరాజ్, మన్నన్, ఖదీర్, బాదర్, మహిళా నాయకురాలు సయ్యదా సమీరా నుస్రత్, సోషల్ మీడియా ఇంచార్జ్ వాసు బాబు, సిల్వేరు సాంబశివ, డిఈ ఇష్రాత్ ఆయేషా , ఏఈలు అరుణ్, సుదర్శన్, వర్క్ ఇన్స్పెక్టర్ రతన్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం తక్షణమే నిధులు కేటాయించాలి

ప్రత్యేక నిధులు విడుదల చేసి గ్రామాల్లో నెలకొన్న రోడ్ల, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య ముదిరాజ్ :** గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేసి మౌలిక సదుపాయాలైన రోడ్లు, డ్రైనేజీలు, అభివృద్ధి పనులను చేపట్టాలని, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి సమస్యలను పరిష్కరించాలనీ దావూద్‌గూడ గ్రామ ఉపసర్పంచ్ ఆర్. తేజనాయక్ ప్రభుత్వాన్ని కోరారు. గ్రామాల్లో ప్రధాన రహదారులు, అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో రోడ్లపై గుంతలు ఏర్పడి ప్రజల రాకపోకలకు ఆటంకం కలుగుతోందన్నారు. విద్యార్థులు, రైతులు, వృద్ధులు అత్యవసర సేవలు పొందే ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. గ్రామ పంచాయతీలకు సరిపడా నిధులు అందుబాటులో లేకపోవడం వల్ల అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేసి, అదనపు ప్రత్యేక నిధులు కేటాయించి గ్రామీణ రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చి, రోడ్ల మరమ్మతులు మౌలిక వసతుల అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలి



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య ముదిరాజ్ :** విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని లేమూర్ గ్రామ సర్పంచ్ ఎలుక మేఘనాథ్ రెడ్డి ఆకాంక్షించారు. కందుకూరు మండల పరిధిలోని లేమూర్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో అక్షరాభ్యాసం, పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎలుక మేఘనాథ్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఎలుక సంజీవరెడ్డి , 6వ వార్డు సభ్యులు దప్పు భవాని మహేందర్ తదితరులు నూతనంగా చేరిన చిన్నారులకు సర్పంచ్, ఉపాధ్యాయులు, పలకలపై అక్షరాలు దిద్దించారు. విద్యార్థులను ఆప్యాయంగా పలకరిస్తూ అభ్యాసన పుస్తకాలు, ఆట వస్తువులను అందించారు. విద్యార్థుల చదవడం, రాయడం నైపుణ్యాలను పరిశీలించారు. చిన్నారులు ఉత్సాహంగా అక్షరాలు, సంఖ్యలు రాస్తూ తమ ప్రతిభను చాటారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఉపాధ్యాయుల కృషిని ప్రజాప్రతినిధులు అభినందించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కేసీఆర్ వి స్కీంలు.. రేవంత్ వి స్కాంలు..

## రైతులు, పేదలంటే రేవంత్ కి మనస్సు లేదన్న హరీష్ రావు

**కమీషన్ల పనులే రేవంత్ చేపడుతున్నాడు**

**మంత్రులు పొన్నం, అడ్లూరికి వారి శాఖల్లో ఏం జరుగుతుందో తెలియదు..**

**తెలంగాణ బాగుండాలంటే కేసీఆర్ మళ్లీ గెలువాలి**



**తిమ్మాపూర్ :** తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక కేసీఆర్ హయాంలో స్కీంలు చేపడితే కాంగ్రెస్ పాలనలో రేవంత్ సర్కారు స్కాంలకు పాల్పడుతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. కరీంనగర్ జిల్లా అల్గునూర్ లో మానకొండూర్ నియోజకవర్గ స్థాయి డిజిటల్ సభ్యత్వ నమోదు తో పాటు సర్ పై విస్తృత స్థాయి సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన హరీష్ రావుకు అల్గునూర్ లో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ... మేనిఫెస్టోలో చెప్పని కేసీఆర్ ప్రభుత్వంలో రైతు బంధు, రైతు భీమా, కళ్యాణ లక్ష్మీ లాంటి స్కీంలను కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తే... సివిల్ సప్లైలో, సింగరేణిలో, హామ్ రోడ్లలో, పిల్లలకు అన్నం పెట్టే గుడ్లలో, బట్టలలో స్కాంలు రేవంత్ సర్కారు జరుగుతున్నాయని ఆరోపించారు. ఉపాధి కూలీలకు రూ.12వేలు ఇవ్వడం లేదని, మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న రేవంత్ కుటుంబం కోటీశ్వరులు అవుతున్నారని విమర్శించారు.

జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ సంక్షేమ మంత్రులకు తెలియకుండా స్కాంలు జరుగుతున్నాయని, జిల్లా పరువు పోతుందని, రూ.2వేల కోట్ల స్కాం జరిగినా వారికి తెలియలేదని, ఇందులో ఎనుమల వారిదే రాజ్యం నడుస్తోందన్నారు. పతకాల అమలుకు ఖజానా లేదంటున్న రేవంత్ ఫుట్ బాల్ ఆటకి, అందాల పోటీలకు, వాస్తు పేరుతో సచివాలయ పనులకు, పలుచోట్ల క్యాంపు ఆఫీసులకు వందల కోట్లు ఖర్చు చేస్తున్నాడని, ఆయనకు రైతులు, మహిళల పట్ల, పేదల పట్ల మనస్సు లేదని విమర్శించారు. మన సొమ్మును ఇతర రాష్ట్రాల్లో ప్రకటనలకు, ఎన్నికలకు, ఢిల్లీకి పంపిస్తున్నాడని ఆరోపించారు. కమీషన్లు రావని పేదల పథకాలు అమలు చేయడం లేదని, కమీషన్లు వచ్చే పనులను రేవంత్ చేపడుతున్నాడని విమర్శించారు. ఓట్లు పెట్టి దేవుణ్ణి మోసం చేసిన ఎగువేతల రేవంత్ రెడ్డి విద్యార్థులను, నిరుద్యోగులను, రైతులను. మోసం చేస్తున్నాడని అన్నారు.

ఎగవేతల రేవంత్ అంటే తనపై తిమ్మాపూర్ స్టేషన్ లో కేసు పెట్టినారని, ఇటీవల నోటీసులు ఇచ్చారని, ఆయన ఎగవేతల రేవంత్ అని మరోసారి అన్నారు. రైతు బంధు రూ.19వేల కోట్లు ఎగబెట్టారని అన్నారు. కేసీఆర్ హయాంలో కరోనా లాంటి క్లిష్ట పరిస్థితుల్లో సైతం ఏనాడు ఆపలేదని గుర్తు చేశారు. రైతు భీమా ప్రీమియం గడువు పూర్తయి నాలుగు నెలలు అయిందని, రైతులు చనిపోతే ఆ కుటుంబాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. డిస్కం పేరుతో రైతులకు విద్యుత్తు కోతను తీసుకురానున్నారని ఆరోపించారు. రిజర్వాయర్లు, మెయిన్ కెనాల్స్ పూర్తి చేసి వేల ఎకరాలకు నీరిచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వముదేనని, పిల్ల కాలువలు పూర్తి చేస్తే మరిన్ని ఎకరాలకు నీరు అందించవచ్చన్నారు. అడుగడుగునా రైతులను వేధిస్తున్న కాంగ్రెస్ కి ఎవరైనా ఓటు వేస్తారా అంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టి వేధిస్తున్న కాంగ్రెస్ ఓటమి అంచున ఉందన్నారు. వడ్లుకొనే తెలివిలేని రేవంత్ బీఆర్ఎస్ ని మొలకెత్తనివ్వనని అంటున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ పరిస్థితి ఆయనకు అర్థమైందని, ఆయన పని అయిపోయినందునే అధికారులు ఆయన మాట వినడం లేదని ఎద్దేవా చేశారు. తెలంగాణ బాగుండాలంటే బీఆర్ఎస్ మళ్లీ గెలిచి కేసిఆర్ ముఖ్యమంత్రి కావాలని ఆయన అన్నారు. తెలంగాణ ఉద్యమంలో మానకొండూర్ నియోజకవర్గ ప్రజలు మనస్ఫూర్తిగా ఉద్యమం చేసినారని, 2001లో అన్నీ జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలను గెలుపొందిన నియోజకవర్గములో కరుడుగట్టిన కార్యకర్తలున్నారని అన్నారు.

**డిస్కం బూతం రాబోతుంది...**

కేసీఆర్ ప్రభుత్వంలో 24 గంటల నాణ్యమైన కరెంటు ఇస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వంలో పదకొండు గంటలకు తగ్గిందని, రైతు డిస్కంను ప్రవేశపెట్టి ఆరు ఏడు గంటలకే కుదించనున్నారని తెలిపారు. రైతు డిస్కం పేరిట సోలార్, విండ్ పవర్ ఇచ్చేలా చూస్తున్నారని, రాత్రి పూట కరెంటు ఎలా వస్తుందని ఆయన ప్రశ్నించారు. రైతుల ఉసురు తీసేందుకు రైతు డిస్కంలను తీసుకురానున్నారని ఆరోపించారు. ఇలాంటి రేవంత్ కి రైతులు ఎవరైనా ఓటు వేస్తారా అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ రైతులు సైతం కేసీఆర్ ని గుర్తు చేస్తున్నారని, రేవంత్ కి ఓటు వేసేందుకు సిద్దంగా లేరని ఆన్నారు.

**రీఎంబర్స్ మెంట్..**

రీఎంబర్స్ మెంట్ ని నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలల్లో సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని హరీష్ రావు ఆరోపించారు. బలహీన వర్గాల పిల్లలంటే రేవంత్ కి ఇష్టం లేదన్నారు. ఇప్పటి వరకు సీఎం, మంత్రులు రీ ఎంబర్స్ మెంట్ విషయం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉన్నత విద్యకు 30లక్షల మంది విద్యార్థులు దూరమై ఒక తరం వెనుకబడే ప్రమాదం ఉందన్నారు. కాంట్రాక్టర్లకు డబ్బులు ఇస్తున్న రేవంత్ సర్కారు పేద విద్యార్థులకు ఇవ్వడానికి మనస్సు రావడం లేదని విమర్శించారు. రెండు లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పిన రేవంత్ కేవలం 16వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చిందని, నిరుద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు.

**రిజర్వాయర్ల ఘనత మాదే...**

తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రాన్ని సస్యశ్యామం చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని, 23 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందంచినట్లు తెలిపారు. ప్రాజెక్టులు, ప్రధాన కాలువలు పూర్తి చేసినట్లు, పిల్ల కాలువలు అక్కడక్కడా పూర్తి చేస్తే మరిన్ని ఎకరాలకు నీరు అందించవచ్చన్నారు.

**మన ఓట్లు జాగ్రత్త...**

ప్రతీ 20 ఏళ్లకోసారి ఓటరు జాబితా సవరణ (సర్) ని ఎన్నికల కమీషన్ చేపడుతుందని, దీనిపై బీఆర్ఎస్ కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. విచారణ సమయంలో అధికారుల వెంట బీఆర్ఎస్ బూత్ ఇంచార్జీలు ఉండాలని సూచించారు. రివిజన్ సమయంలో ఇతర పార్టీల వారి పేర్లను తొలగించే ప్రమాదం ఉందని, జాగ్రత్తగా గమనించాలని తెలిపారు. మన ఓట్లు పోకుండా చూసుకోవాలని, రివిజన్ విషయంలో ఓట్లు కోల్పోతే అప్పీలు చేసుకునే అవకాశం ఉందని, అప్పీలు ద్వారా ఓటు హక్కు తెచ్చుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణా రావు, ఇంచార్జీ రవీంధర్ రావు, కార్పోరేటర్ కాల్వ మల్లేశం, నాయకులు రవీందర్ సింగ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, చల్ల హరిశంకర్, కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, రావుల రమేష్, సిద్దం వేణు, శేఖర్ గౌడ్, స్వామిరెడ్డి, ఏకానందం, నాయిని వెంకట రెడ్డి, రవీంధర్ రెడ్డి, వెంకన్న, మహిపాల్, రెడ్డి, పొన్నం అనిల్ గౌడ్, గద్దం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో వింత వాతావరణం

## ఓ వైపు ఎండలు... మరో వైపు వానలు



**హైదరాబాద్ :** గాణ ప్రభుత్వం అప్రమత్తం అయింది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన తర్వాత స్పందించడం కంటే, వాటి ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి నివారణ చర్యలు చేపట్టాలని తెలంగాణ రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు రెవెన్యూ, విపత్తుల నిర్వహణ యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో సాయంత్రం తరువాత ఒకట్రెండు చోట్ల వర్షం పడే అవకాశం ఉందని తెలంగాణ వెదర్ మ్యాన్ అంచనా వేశారు. ఎల్ నినో ప్రభావంతో జూన్ 15 దాటినా కూడా ఏపీ, తెలంగాణలో భారీ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇంకా తెలుగు రాష్ట్రాల్లో ఏసీలు, కూలర్లు వాడుతుండటమే అందుకు నిదర్శనంగా చెప్పవచ్చు.

**19 నుంచి వారం రోజులు భారీ వర్షాలు**

ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు రాష్ట్రమంతటా విస్తరిస్తున్నాయి. బుధవారం, గురువారాల్లో ఉత్తర, దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో పలుచోట్ల ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది. జూన్ 19వ తేదీ నుంచి తెలంగాణవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని, వారం రోజులపాటు ఈ ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. జూన్ 1 నుంచి జూన్ 15 వరకు రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 54.9 మిల్లీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా.. ప్రస్తుతం 10 శాతం లోటుతో 49.2 మి.మీ నమోదైందని తెలిపారు. భారీ వర్షాల హెచ్చరికలతో అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు విపత్తుల నిర్వహణ శాఖ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు. వరద ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు.

**ఓవైపు వర్షాలు.. మరోవైపు వడగాల్పులు**

రాష్ట్రంలో విచిత్రమైన వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒకవైపు భారీ వర్షాల హెచ్చరికలు ఉన్నప్పటికీ సోమవారం నాడు ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లోని పలు మండలాల్లో తీవ్రమైన వడగాలులు వీచాయి. ఈ జిల్లాల్లో సాధారణం కంటే 4.6 డిగ్రీల వరకు అధికంగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్, మహబూబ్‌నగర్ మినహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ సాధారణం కంటే 3 డిగ్రీల మేర పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. నేడు (జూన్ 16న) కూడా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పలుచోట్ల వడగాలులు వీచనున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. కాగా, నిన్న గరిష్టంగా వికారాబాద్ జిల్లా రాపోలులో 4.4 సెం.మీ. వర్షపాతం నమోదయింది.

**ఏపీలో పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు.. కొన్నిచోట్ల తీవ్రమైన ఎండలు**

ఆంధ్రప్రదేశ్‌లో ఒకవైపు ఎండ తీవ్రత, మరోవైపు పిడుగులతో కూడిన వర్షాలు కురిసే విచిత్రమైన వాతావరణ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వాతావరణం వేగంగా మారుతోందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు. ముఖ్యంగా విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని, మిగతాచోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఇక కోస్తాంధ్రలోని మిగిలిన జిల్లాలతో పాటు రాయలసీమ పరిధిలోని చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కూడా అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ముఖ్యంగా శ్రీకాకుళం, మన్యం, విజయనగరం జిల్లాల్లో పిడుగులు పడే తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని హెచ్చరించింది. అంతకుముందు సోమవారం నాడు కూడా ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసిన సంగతి తెలిసిందే.మరోవైపు రాష్ట్రంలో ఎండల ప్రభావం కూడా గట్టిగానే ఉందని అధికారులు తెలిపారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో అనవసరంగా బయటకు రాకూడదని, ఒకవేళ అత్యవసర పనులపై బయటకు వెళ్లాల్సి వస్తే చెవుల్లోకి నేరుగా వేడిగాలి వెళ్లకుండా తలకు గుడ్డ కట్టుకోవడం లేదా టోపీలు ధరించడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

## తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి

**సూరారం డివిజన్ లో నీటి సమస్యలపై పర్యటించిన**

**మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్**



**మన తొలివెలుగు, కుత్బుల్లాపూర్ ప్రతినిధి టి.రమేష్ :** సూరారం డివిజన్‌లో తీవ్ర తాగునీటి సమస్య నెలకొందని వెంటనే పరిష్కరించాలని మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ డిమాండ్ చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని న్యూ షాపూర్ నగర్, సూరారం ప్రాంతాల్లో తాగునీటి సమస్య రోజు రోజుకు తీవ్రమవుతోందని, ముఖ్యంగా సూరారం డివిజన్‌లో తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు . రోజుల తరబడి మంచినీరు అందకపోవడంతో మహిళలు, వృద్ధులు బిందెలతో రోడ్లపైకి వచ్చి తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ పరిస్థితిపై స్పందించిన మాజీ కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ సంబంధిత అధికారుల నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు కనీస అవసరమైన తాగునీటిని కూడా అందించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. సూరారం డివిజన్ ప్రజలకు యుద్ధప్రాతిపదికన తాగునీటి సరఫరా పునరుద్ధరించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో స్థానిక ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం, జలమండలి అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సిద్దిక్ , మధుమోహన్ శ్రీనివాస్ రెడ్డి అమీర్ ఖాన్, సాజిద్, హేమలత రెడ్డి, ముకుందరావు, సత్యనారాయణ, రవికుమార్, లక్ష్మణ్, ప్రశాంత్, శ్రీనివాస్ రాజు శివ, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**గాజులరామారం సర్కిల్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీలో మంజూరైన సీసీ రోడ్లను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్**



**మన తొలివెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి టి.రమేష్ :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని గాజులరామారం సర్కిల్ లో గల శ్రీరామ్ నగర్ కాలనీ ఎం.ఏ ఫంక్షన్ హాల్ నుండి మంజూరైన ఎనిమిది అంతర్గత సీసీ రోడ్లను స్థానిక మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ సోమవారం బస్తీలో తిరుగుతూ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. వాటిలో భాగంగా 55 లక్షల రూపాయలతో మంజూరైన రోడ్లను పరిశీలించడం జరిగిందన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో 10సంవత్సరాల పాటు ఎక్కడ అంతర్గత రోడ్లు మరియు డ్రైనేజీ వ్యవస్థలను ఏర్పాటు చేయలేదని, పూర్తిగా నిర్వీర్యం చేసి ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సీసీ రోడ్లను మంజూరు చేయించిన మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్ ని శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు హరీష్, రాకేష్, మధు, అశ్వత్, అనురాధ, సల్మాన్, నాగరాజు, రఫీ, ఇలియాస్, దశరథ్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెరుగైన విద్య కోసంపూర్తి సహాయ సహకారాలు అందజేస్తా

**దుండిగల్ లో ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక పాఠశాలను సందర్శించిన మాజీ సర్పంచ్ కావలి గణేష్**



**మన తొలివెలుగు, కుత్బుల్లాపూర్ ప్రతినిధి టీ. రమేష్ :** దుండిగల్ గ్రామంలోని ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక పాఠశాలను దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్యా సౌకర్యాలు, మౌలిక వసతులు, అలాగే పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన ఉపాధ్యాయులతో చర్చించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దొంతి మహేష్ ముదిరాజ్, పండుగ శివ ముదిరాజ్, మరియు తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

### భారీగా లాభపడ్డ స్టాక్ మార్కెట్లు..
### 544 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

భారతీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీగా లాభపడ్డాయి. వరుసగా మూడో సెషన్‌లోనూ లాభాలు పొందడం విశేషం. సెన్సెక్స్ 544 పాయింట్లు, నిఫ్టీ 135 పాయింట్లు లాభపడ్డాయి. హార్ముజ్ జలసంధి తెరిచి ఉంచడం, ఇరాన్–అమెరికా మధ్య శాంతి ఒప్పందం మార్కెట్‌కు లాభాలు తెచ్చిపెట్టాయి. మంగళవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 544.15 పాయింట్లు లాభపడి 76,808.48 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ50 కూడా 135.25 పాయింట్లు లాభపడి, 23,989.15 పాయింట్ల వద్ద ముగిసింది. 24,000 మార్క్‌కు నిఫ్టీ దాదాపు 11 పాయింట్ల దూరంలో నిలిచిపోయింది. గత మూడు సెషన్లు కలిపి సెన్సెక్స్ 4 శాతం, నిఫ్టీ 3.6 శాతం లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ ధర 2.57 శాతం తగ్గింది. బ్యారెల్ క్రూడాయిల్ ధర 81.03 డాలర్ల వద్ద ట్రేడయింది. అలాగే, డబ్ల్యూటీఐ క్రూడాయిల్ ధర కూడా 2.71 శాతం తగ్గింది. బ్యారెల్ క్రూడాయిల్ ధర 78.56 డాలర్ల వద్ద కొనసాగింది. ఆసియా మార్కెట్లు కూడా మంగళవారం 0.8 శాతం లాభాలు పొందాయి. రూపాయి కూడా స్వల్పంగా లాభపడింది. డాలర్‌తో రూపాయి విలువ 94.6 వద్ద కొనసాగింది. బీఎస్ఈ30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్, ఎన్టీపీసీ, బజాజ్ ఫిన్‌సర్వ్, హిందుస్తాన్ యునీలీవర్ లాభాలు పొందాయి. వీటిలో అత్యధికంగా హెచ్‌సీఎల్ టెక్ సంస్థ షేర్లు 3.59 శాతం పెరిగాయి. మరోవైపు మారుతి, అల్ట్రాటెక్ సిమెంట్, బీఈఎల్, టాటా స్టీల్, ఇండిగో సంస్థల షేర్లు నష్టపోయాయి. ఇండిగో షేర్లు 0.86 శాతం నష్టాలు చవిచూశాయి. సెన్సెక్స్30 సూచీలో 21 కంపెనీలు లాభాలు పొందగా, 9 సంస్థలు నష్టపోయాయి. శుక్రవారం నుంచి హార్ముజ్ జలసంధి పూర్తిస్థాయిలో తెరుచుకుంటుందనే ప్రకటన, ఇరాన్‌తో శాంతి ఒప్పందం, చమురు ధరలు తగ్గడం మార్కెట్‌కు సానుకూల ఫలితాలు తీసుకొచ్చాయి.

### ఇన్ఫినిక్స్ స్మార్ట్ 20 4జీ ఫోన్ విడుదల..
### ఎంట్రీ లెవెల్ ధరలోనే ఏఐ ఫీచర్లు, హెచ్‌డీం స్క్రీన్

ఇన్ఫినిక్స్ సంస్థ స్మార్ట్ సిరీస్‌లో వరుసగా ఫోన్లు రిలీజ్ చేస్తుంటుంది. తాజాగా ఇన్ఫినిక్స్ స్మార్ట్ 20 పేరుతో 4జీ ఫోన్ విడుదల చేసింది. ఇప్పటికే ఈ ఫోన్ సేల్‌లో అందుబాటులోకి వచ్చింది. ధర ఎంట్రీ లెవెల్‌లోనే ఉన్నప్పటికీ ఏఐ ఫీచర్లు, హెచ్‌డీం స్క్రీన్, ఫాస్ట్ ఛార్జింగ్ వంటి ఫీచర్లున్నాయి.




బేసిక్ ఫోన్ కావాలనుకునేవారు ఈ ఫోన్ కొనుగోలు చేయొచ్చు. ఫ్లిప్‌కార్ట్, ఇన్ఫినిక్స్ సైట్‌లలో మొబైల్ కొనుగోలు చేయవచ్చు. డిస్కౌంట్, ఎక్స్ఛేంజ్ వంటి ఫీచర్లున్నాయి. ఈ ఫోన్‌కు సంబంధించిన పూర్తి ఫీచర్లివి. 4జీబీం64జీబీ, 4జీబీం128జీబీ, 6.78 అంగుళాల హెచ్‌డీం ఎల్‌సీడీ స్క్రీన్, 120 హెర్జ్ రిఫ్రెష్‌రేట్, 700 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్, ఆల్వేస్ ఆన్ డిస్‌ప్లే, డైనమిక్ బార్ నోటిఫికేషన్స్, మీడియాటెక్ హీలియో జీ81 ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 16 బేస్డ్ ఎక్స్ఓఎస్ 16, తెలుగు, తమిళ్, హిందీ, గుజరాతీ, మరాఠీల్లో పని చేసే ఫోలక్స్ వాయిస్ అసిస్టెంట్, బ్లూటూత్ 5.2, 8ఎంపీ రేర్ కెమెరా విత్ ఫ్లాష్, 8 ఎంపీ సెల్ఫీ కెమెరా, 5,200 ఎంఏహెచ్ బ్యాటరీ, 15 వాట్స్ ఫాస్ట్ ఛార్జింగ్, 5 వాట్స్ రివర్స్ వైర్డ్ ఛార్జింగ్, 7.7 ఎంఎం థిక్‌నెస్, ఐపీ 64 రేటింగ్ వంటి ఫీచర్లున్నాయి. సన్‌లైక్ ఆరెంజ్, షాడో బ్లాక్, పోలారిస్ టైటానియం, క్లౌడ్‌లైన్ బ్లూ కలర్స్‌లో లభ్యం. ధరలు రూ.12,499/రూ.13,999.

# ఇదీ భారత్ దెబ్బ

## పాక్‌కు టర్కీ మద్దతు ఇచ్చిన ఫలితం..
## 500 మిలియన్ డాలర్లు తుడిచిపెట్టుకుపోయిన టర్కీ సంస్థ

ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పాకిస్తాన్‌కు అండగా నిలిచినందుకు టర్కీకి భారీ బుద్ధి చెప్పింది ఇండియా. ఆ దేశానికి సంబంధించిన ఏవియేషన్ సంస్థను నిషేధించడంతో ఆ సంస్థ ఒక్కరోజులోనే 500 మిలియన్ డాలర్లు నష్టపోయింది. ఈ విషయాన్ని తాజాగా ఆ సంస్థ చైర్‌పర్సన్ వెల్లడించారు. ఈ ఉదంతంలో నష్టపోయింది టర్కీకి చెందిన సెలెబి ఏవియేషన్ సంస్థ. బ్లూమ్‌బర్గ్ అనే మీడియా సంస్థతో సెలెబి ఏవియేషన్ సంస్థ చైర్‌పర్సన్ క్యానన్ సెలెబియోగ్లు మాట్లాడారు. భారత్ తీసుకున్న నిర్ణయంతో తమ సంస్థ ఎంతగా నష్టపోయిందో ఆమె వివరించారు. గత ఏడాది పహల్గాంలో పాక్ ఉగ్రవాదులు జరిపిన దాడికి ప్రతీకారంగా ఇండియా గత మే నెలలో ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సంగతి తెలిసిందే.




పాకిస్తాన్‌పై నాలుగైదు రోజులపాటు ఇండియా దాడి చేసింది. దీంతో ఇండియా, పాక్ మధ్య యుద్ధ వాతావరణం ఏర్పడింది. అయితే, ఈ యుద్ధంలోకి దూరింది టర్కీ. అది కూడా పాకిస్తాన్‌కు మద్దతుగా. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్‌కు మద్దతు ఇచ్చిన టర్కీ.. ఆ దేశానికి 350కి పైగా డ్రోన్లు పంపింది. అలాగే, యుద్ధ నౌక, ఒక యుద్ధ విమానాన్ని కూడా పంపించింది. తాము పాకిస్తాన్‌కు అండగా ఉంటామని టర్కీ బహిరంగంగా ప్రకటించింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన భారత్.. అప్పట్లో ఆ దేశంతో అనేక వాణిజ్య పరమైన ఆంక్షల్ని విధించింది. ఆ దేశానికి మన ఆహార ఉత్పత్తుల ఎగుమతుల్ని నిలిపివేసింది. అలాగే, ఆ దేశం నుంచి అనేక ఉత్పత్తుల దిగుమతుల్ని కూడా నిషేధించింది. ఇదే సమయంలో టర్కీకి చెందిన సెలెబి ఏవియేషన్‌పై కూడా నిషేధం విధించింది. సెలెబి ఏవియేషన్.. మన దేశంలో ఏవియేషన్ సంబంధిత సేవలు అందిస్తుంది. అంటే కార్గో విమానాలకు, ప్యాసింజర్లకు, కార్గో సేవలకు సంబంధించిన పనులు నిర్వహిస్తుంటుంది. దేశంలో ముంబై, ఢిల్లీ సహా పలు చోట్ల ఎయిర్‌పోర్టుల్లో ఈ సంస్థ సేవలు అందించేది. ఎయిర్‌పోర్టులలో కార్గో వేర్‌హౌజ్, స్టోరేజ్, హ్యాండ్లింగ్ వంటి ఆపరేషన్స్ నిర్వహించేది. నేరుగా విమానాలు నడపకపోయినప్పటికీ వాటి సంబంధిత సేవల వ్యాపారం నిర్వహించేది. ఇండియాలోనే ఈ సంస్థకు అతిపెద్ద మార్కెట్ ఉంది. అయితే, ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్‌కు టర్కీ మద్దతు ఇచ్చినందుకు ఆగ్రహించిన ఇండియా.. సెలెబి ఏవియేషన్ సంస్థపై నిషేధం విధించింది. దేశ భద్రత రీత్యా ఈ సంస్థకు సెక్యూరిటీ అనుమతులు రద్దు చేసింది. తక్షణమే సేవల్ని ఉపసంహరించాలని సూచించింది. సంస్థకు చెందిన ఉద్యోగుల్ని ఇతర సంస్థలకు బదలాయించింది. దీంతో ఈ సంస్థ సేవలు ఇండియాలో ఉన్నట్లుండి నిలిచిపోయాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలోనే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. దీని ఫలితంగా ఒక్క రోజులోనే 500 మిలియన్ డాలర్లు సంస్థ నష్టపోయింది. తాము దశాబ్దాలుగా నిర్మించుకున్న వ్యాపార సామ్రాజ్యం.. భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ఒక్క రోజులోనే కూలిపోయిందని, 500 మిలియన్ డాలర్ల నుంచి సున్నాకు పడిపోయామని సంస్థ చైర్‌పర్సన్ క్యానన్ సెలెబియోగ్లు అన్నారు. ఇండియా నిర్ణయం వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. గత మే నెలలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని కంపెనీ ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసింది. అయితే, దేశ భద్రత విషయంలో కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు సమర్థించింది. తమకు వ్యాపారం కన్నా, దేశ భద్రతే ముఖ్యమని కోర్టు తెలిపింది. తమకు, టర్కీ ప్రభుత్వానికి సంబంధం లేదని సెలెబి కంపెనీ చేసిన వాదనను కోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. కోర్టు విచారణలో టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ కూతురుకు సెలెబి సంస్థలో వాటా ఉన్నట్లు కూడా తేలింది. దీంతో కేంద్రానికి అనుకూలంగా, సంస్థకు వ్యతిరేకంగా గత జూలైలో కోర్టు నిర్ణయం తీసుకుంది. అప్పటి నుంచి సంస్థ సేవలు దేశంలో నిలిచిపోయాయి. కేంద్రం తీసుకున్న ఒక్క నిర్ణయంతో టర్కీ కంపెనీ నష్టాల బాటలో నడుస్తోంది.

### డబ్ల్యూపీఐకి గుడ్‌బై.. పీపీఐకి మారనున్న కేంద్రం!

ధరల తీరును మరింత ప్రతిఫలించే విధంగా వస్తు, సేవలకు ఉత్పత్తిదారుల ధరల సూచీ (పీపీఐ)ని కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రకటించింది. ప్రస్తుతం ప్రతి నెలా విడుదల చేస్తున్న టోకు ధరల ఆధారిత సూచీ స్థానంలో వచ్చే ఐదేళ్లలోపు దీన్ని పూర్తిస్థాయిలో ప్రవేశపెట్టనుంది. దేశవ్యాప్తంగా మే నెలకు అన్ని కమోడిటీలకు సంబంధించి అవుట్‌పుట్ పీపీఐ 109.6 శాతంగా నమోదైంది. ఏప్రిల్‌లో ఇది 108.6 శాతంగా ఉంది. తయారీ రంగానికి సంబంధించి ప్రయోగాత్మక ఇన్‌పుట్ పీపీఐ మే నెలకు 104.9గా ఉంది. ప్రయోగాత్మక విధానంలో విడుదల చేస్తున్న ఈ డేటా నాణ్యతను పరిశీలించి, భాగస్వాముల అభిప్రాయాలను తెలుసుకుని అవసరమైన దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం తెలిపింది. అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రస్తుతం ఇదే విధానం అమల్లో ఉంది. దీంతో భారత్ సైతం డబ్ల్యూపీఐ నుంచి పీపీఐకి మారాలంటూ ప్రపంచ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) చాన్నాళ్లుగా కోరుతోంది. దీనికితోడు నీతిఆయోగ్ వర్కింగ్ గ్రూప్ ఇటీవలే చేసిన సిఫారసుల మేరకు పీపీఐకి మారాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఒక ఉత్పత్తి తయారీ లేదా సేవను అందించేందుకు కంపెనీకి అయ్యే వ్యయాన్ని ఇన్‌పుట్ ప్రైస్ రూపంలో, తయారీ అనంతరం ఆయా సంస్థలు విక్రయించే ధరను



అవుట్‌పుట్ ప్రైస్ రూపంలో డేటాను విడుదల చేయనున్నారు. ఇన్‌పుట్ ధరలు పెరుగుతుంటే (కంపెనీలు వినియోగించే ముడి సరుకులు, విడిభాగాలు, మైక్రోచిప్‌లు తదితర), అంతిమంగా కంపెనీలు ఆ భారాన్ని వినియోగదారులకు బదిలీ చేస్తుంటాయి. దాంతో రిటైల్ ధరలు పెరుగుతాయి. ఈ డేటాకు అనుగుణంగా ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వం తగిన దిద్దుబాటు చర్యలు తీసుకునేందుకు వీలుంటుంది. పీపీఐ అవుట్‌పుట్ ప్రైస్‌కు రవాణా, పన్నులు, వర్తకుల మార్జిన్‌లు కలసి రిటైల్ ధరలు నిర్ణయమవుతాయి

## స్పెయిన్‌ను వణికించి ఒక్క మ్యాచ్‌తో ఓవర్‌నైట్ స్టార్..
# 24 గంటల్లో 60 లక్షల మంది ఫ్యాన్స్


2026 ఫిఫా ప్రపంచకప్‌లో ఎవరూ ఊహించని ఒక అద్భుతం జరిగింది. ప్రపంచ ఫుట్‌బాల్‌లోనే అత్యంత బలమైన జట్లలో ఒకటైన మాజీ ఛాంపియన్ స్పెయిన్‌ను, టోర్నీలోకి అనామక జట్టుగా అడుగుపెట్టిన చిన్న దేశం కేప్ వర్డే (ఝుఎశీ ఎవతీఎవ) 0–0 తో నిలువరించి అందరిని ఒక్కసారిగా షాక్‌కి గురిచేసింది. వరల్డ్ నెం 2 ర్యాంక్ ఉన్న దేశంతో మ్యాచ్ ఆడుతున్నాం అన్న భయం లేకుండా స్పానిష్ జట్టుకు చుక్కలు చూపించింది. అయితే ఈ చారిత్రాత్మక డ్రా వెనుక ఆ జట్టు 40 ఏళ్ల వెటరన్ గోల్ కీపర్ వోజిన్హా (జోసిమార్ జోస్ ఎవోరా దయాస్) చూపిన అసాధారణ పోరాటపటిమ ఉంది. మ్యాచ్ ప్రారంభానికి ముందు కేవలం 50 వేల మంది ఇన్స్టాగ్రామ్ ఫాలోవర్లు మాత్రమే ఉన్న వోజిన్హా ఖాతాకు, మ్యాచ్ ముగిసిన 24 గంటల్లోనే ఏకంగా 6 మిలియన్ల (60 లక్షల) మంది కొత్త అభిమానులు వచ్చి చేరారంటే అతడు ఏ రేంజ్‌లో జట్టును ఆదుకున్నాడో అర్థం చేసుకోవచ్చు. కేప్ వర్డే దేశ మొత్తం జనాభా సుమారు 5.3 లక్షలు మాత్రమే కాగా, ఆ దేశ జనాభా కంటే పది రెట్లకు పైగా ఫాలోవర్లను సంపాదించుకుని అతను రాత్రికి రాత్రి గ్లోబల్ సోషల్ మీడియా స్టార్‌గా అవతరించాడు. ఇక ఈ మ్యాచ్‌లో స్పెయిన్ జట్టు పూర్తి ఆధిపత్యం చలాయిస్తూ ఏకంగా 27 సార్లు కేప్ వర్డే గోల్ పోస్ట్‌పై దాడులు చేసింది. అయితే ప్రపంచ స్థాయి స్టార్ ఆటగాళ్లు కొట్టిన ప్రమాదకరమైన షాట్లను వోజిన్హా గోడలా అడ్డుకున్నాడు. ముఖ్యంగా మ్యాచ్ చివరి నిమిషాల్లో ఫెర్రాన్ టోరెస్, ఐమెరిక్ లాపోర్టేలు చేసిన గోల్ ప్రయత్నాలను అతను ఒంటిచేత్తో తిప్పికొట్టిన తీరు అభిమానులను ఫిదా చేసింది. మొత్తం 8



అద్భుతమైన సేవ్స్‌తో స్పెయిన్‌కు చుక్కలు చూపించిన వోజిన్హా ప్రపంచకప్ అరంగేట్రం మ్యాచ్‌లో ప్రత్యర్థికి ఒక్క గోల్ కూడా ఇవ్వకుండా రికార్డు సృష్టించిన అత్యంత వృద్ధ గోల్ కీపర్‌గా చరిత్రకెక్కాడు. అతని ఈ అసమాన ప్రదర్శనకు గాను 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. మరోవైపు మ్యాచ్ ముగిసిన వెంటనే వోజిన్హా మైదానంలోనే మోకాళ్లపై కూలబడి ఎమోషనల్ అవుతూ కన్నీరు పెట్టుకున్న దృశ్యాలు అందరినీ కదిలించాయి. తన కన్నీళ్ల వెనుక ఉన్న బాధను పంచుకుంటూ, తాను చిన్నప్పుడు తాతయ్య, అమ్మమ్మల వద్ద పెరిగానని, తన జీవితంలో సర్వస్వమైన వారు ఈ చారిత్రాత్మక క్షణాన్ని చూడటానికి ఇప్పుడు బతికి లేరని ఆవేదన వ్యక్తం చేశాడు. అంతేకాకుండా, అమెరికా కఠినమైన వీసా నిబంధనలు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా తన తల్లి కూడా ఈ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా చూడటానికి స్టేడియానికి రాలేకపోయిందని, తన జీవితకాల స్వప్నం నెరవేరిన వేళ వారు పక్కన లేకపోవడం బాధగా ఉన్నప్పటికీ, తన దేశానికి ఈ గౌరవం తెచ్చిపెట్టడం గర్వంగా ఉందంటూ భావోద్వేగానికి గురయ్యాడు.

### తన పేరుతో ఉన్న ఎఫ్‌బీ పేజీపై సౌరవ్ గంగూలీ ఫిర్యాదు

**కోల్‌కతా:** భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ ఇవాళ కోల్‌కతా పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన పేరుతో ఫేస్‌బుక్ పేజీని ఆపరేట్ చేసి.. తన ప్రతిష్టను దిగజార్చుతున్నట్లు ఆయన ఆరోపించారు. సౌరవ గంగూలీ ఫ్యాన్స్ అన్న సోషల్ మీడియా పేజీలో తనకు సంబంధం లేకుండానే అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్పోర్ట్స్‌వికీ అనే మరో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌పై కూడా సౌరవ్ గంగూలీ ఫిర్యాదు చేశారు. థాకుర్‌పుకుర్ పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తన ప్రతిష్టను కళంకం చేసే రీతిలో ఫేస్‌బుక్ పేజీలో నిరంతరం పోస్టులు చేస్తున్నారని, ప్రజల్లో తన పట్ల నెగటివ్ భావన వచ్చేలా ప్రవర్తిస్తున్నారని గంగూలీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను పబ్లిక్ ఫిగర్ కావడం వల్ల సమస్య మరింత పెరుగుతోందని, కానీ తప్పుడు విషయాలను వ్యాప్తి చేస్తున్నారని, అభ్యంతరకర, డ్యామేజింగ్ కంటెంట్‌ను ప్రచారం చేస్తున్నారని, తన గౌరవాన్ని భంగపరిచే రీతిలో వ్యవహరిస్తున్నారని, ఈ నేపథ్యంలో కఠినన న్యాయపరమైన చర్య తీసుకోవాలని గంగూలీ తన ఫిర్యాదులో కోరారు. సౌరవ్ గంగూలీ ఫ్యాన్స్ పేరుతో ఫేస్‌బుక్ పేజీని ఆపరేట్ చేస్తున్నవారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## స్పోర్ట్స్

### జపాన్‌పై సూపర్ విక్టరీ.. నేషన్స్ కప్ సెమీఫైనల్లో టీమిండియా..!



ఎఫ్ఐహెచ్ నేషన్స్ కప్‌లో భారత మహిళల హాకీ జట్టు అజేయంగా దూసుకెళుతోంది. ఆక్లాండ్ వేదికగా మంగళవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో జపాన్‌పై కాస్త కష్టపడి గెలిచిన టీమిండియా సెమీఫైనల్ చేరుకుంది. తద్వారా సలీమా టెటె సారథ్యంలోని భారత్ గ్రూప్ ఏ నుంచి సెమీస్ బెర్తు దక్కించుకుంది. న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో జరుగుతున్న ఎఫ్ఐహెచ్ నేషన్స్ కప్‌లో భారత జట్టు గొప్పగా ఆడుతోంది. జపాన్ రూపంలో క్వార్టర్ ఫైనల్లో కఠినమైన ప్రత్యర్థికి ఎదురైనప్పటికీ 2–1తో టీమిండియా గెలుపొందింది. కెప్టెన్ సలీమా టీటె, ఫార్వార్డ్ లల్‌ర్మెసియామి చెరొక గోల్ చేయడంతో జపాన్‌కు ఓటమి తప్పలేదు. మూడో అర్ధ భాగంలో 33వ నిమిషంలో సలీమ, 49వ నిమిషంలో లల్‌రెస్మియామి గోల్ చేయడంతో భారత్ ఆధిక్యం 2–1కు చేరింది. తద్వారా ఆరు పాయింట్లో గ్రూప్ ఏ నుంచి అగ్రస్థానంలో నిలిచిన టీమిండియా సెమీస్ బెర్తు పట్టేసింది. అంతేకాదు వచ్చే ఏడాది జరుగబోయే ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌కు టీమిండియా అర్హత సాధించింది.



# నిశ్చితార్థం తర్వాత షాకింగ్ ట్విస్ట్.. ప్రియుడితో బ్రేకప్ అయ్యిందా?

టాలీవుడ్, కోలీవుడ్ సినీ వర్గాల్లో ప్రస్తుతం నటి సునయన వ్యక్తిగత జీవితం హాట్ టాపిక్‌గా మారింది. గత కొంతకాలంగా ప్రేమలో ఉన్నట్లు వార్తల్లో నిలిచిన ఈ హీరోయిన్, ఇప్పుడు తన ప్రియుడితో విడిపోయిందనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన రాకపోయినా, ఆమె సోషల్ మీడియా ఖాతాల్లో జరిగిన మార్పులు ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూర్చుతున్నాయి. ఇటీవల విడుదలైన కుబేర చిత్రంలో కీలక పాత్ర పోషించి మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన సునయన, గత ఏడాది నుంచి దుబాయ్‌కు చెందిన ఓ వ్యాపారవేత్తతో ప్రేమలో ఉన్నట్లు ప్రచారం జరిగింది. సినీ వర్గాల్లో కూడా వీరి సంబంధంపై చర్చలు జరిగాయి. అంతేకాకుండా కొద్ది నెలల క్రితం ఆమె సోషల్ మీడియాలో పరోక్షంగా తన నిశ్చితార్థాన్ని ప్రకటించినట్లు భావించారు. అప్పుడు సునయన తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఒక వ్యక్తి చేయి పట్టుకున్న ఫోటోను షేర్ చేస్తూ, త్వరలోనే తన జీవిత భాగస్వామిని పరిచయం చేస్తానంటూ సంకేతాలు ఇచ్చింది. ఆ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అభిమానులు, సినీ ప్రముఖులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో పెళ్లి వార్త కూడా వినిపిస్తుందని చాలామంది భావించారు. అయితే తాజాగా పరిస్థితి పూర్తిగా మారిపోయినట్లు కనిపిస్తోంది. సునయన తన సోషల్ మీడియా ఖాతాల నుంచి నిశ్చితార్థానికి సంబంధించిన ఫోటోలు, ప్రియుడితో ఉన్న పోస్టులు, సంబంధాన్ని సూచించే పలు చిత్రాలను తొలగించినట్లు నెటిజన్లు గుర్తించారు. దీంతో వీరిద్దరి మధ్య విభేదాలు తలెత్తాయా? లేక నిజంగానే బ్రేకప్ జరిగిందా? అనే ప్రశ్నలు తెరపైకి వచ్చాయి. సోషల్ మీడియాలో సెలబ్రిటీలు తమ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పోస్టులను తొలగించడం తరచుగా చర్చనీయాంశంగా మారుతుంది. ఈ నేపథ్యంలో సునయన కూడా తన సంబంధానికి సంబంధించిన ఫోటోలను డిలీట్ చేయడంతో, పెళ్లికి ముందే ఈ ప్రేమకథకు ముగింపు పడిందని కొందరు నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు మాత్రం అధికారిక ప్రకటన వచ్చే వరకు ఎలాంటి నిర్ణయానికి రావడం సరైంది కాదని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటివరకు ఈ ప్రచారంపై సునయన స్పందించలేదు. ఆమె మౌనం పాటించడంతోనే ఈ వార్తలు మరింత వేగంగా వ్యాపిస్తున్నాయి. అభిమానులు కూడా అసలు విషయంపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. కన్నడ చిత్రంతో సినీ ప్రయాణాన్ని ప్రారంభించిన ఆమె, తెలుగులో పలు చిత్రాల ద్వారా ప్రేక్షకులకు దగ్గరయ్యారు. 'కుమార్ వర్సెస్ కుమారి' సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైన సునయన, ఆ తర్వాత '10వ్ర జశ్రీఖంం', 'మిస్సింగ్', 'వేటాడు వెంటాడు', 'ఎంతవరకు ఈ ప్రేమ' , రాజ రాజ చోర, లత్తి వంటి చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.



## తెరపైకి మరో స్టార్ కిడ్.. రాజ్‌కుమార్ హిరాణీ కొడుకు 'ప్రీతమ్ అండ్ పెడ్రో' ట్రైలర్ రిలీజ్!

ఇటీవలే 'జాలీ ఎల్‌ఎల్‌బీ 3'తో ప్రేక్షకులను అలరించిన బాలీవుడ్ ప్రముఖ నటుడు అర్షద్ వార్సి, ఇప్పుడు సరికొత్త సైబర్ క్రైమ్ థ్రిల్లర్ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ప్రీతమ్ అండ్ పెడ్రో' వెబ్ సిరీస్ అధికారిక ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ ట్రైలర్‌లో డిజిటల్ ప్రపంచంలో జరిగే సైబర్ క్రైమ్, కిడ్నాప్ కేసు చుట్టూ తిరుగుతూ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. ఒక పోలీస్ ఆఫీసర్, ఒక హ్యాకర్ మధ్య కుదిరిన వింతైన భాగస్వామ్యం, వారిద్దరూ కలిసి చేసే ప్రమాదకరమైన సైబర్ ఛేజింగ్, దీనికి తోడు కామెడీ, సస్పెన్స్, మిస్టరీ కలబోతగా ఈ సిరీస్ రూపొందింది. ఈ సిరీస్‌లో అర్షద్ వార్సి ఒక క్రైమ్ బ్రాంచ్ పోలీస్ ఆఫీసర్ 'పెడ్రో' పాత్రను పోషించారు. పనిష్మెంట్ ట్రాన్స్‌ఫర్‌పై సైబర్ సెల్‌కు వచ్చిన ఆయన, అక్కడ ఒక మినిస్టర్ కొడుకును రక్షించే క్రమంలో 'ప్రీతమ్' అనే యంగ్ హ్యాకర్‌తో కలిసి పనిచేయాల్సి వస్తుంది. ఈ ప్రీతమ్ పాత్రలో ప్రముఖ స్టార్ దర్శకుడు రాజ్‌కుమార్ హిరాణీ కుమారుడు 'వీర్ హిరాణీ' నటుడిగా బాలీవుడ్‌కు పరిచయమవుతున్నారు. గతంలో 'మున్నాభాయ్ వీదీదూ' క్లైమాక్స్‌లో సర్ప్యాట్ కొడుకుగా కాసేపు మెరిసిన వీర్, ఇప్పుడు పూర్తిస్థాయి హీరోగా ఎంట్రీ ఇస్తుండటం విశేషం. కాగా, ఈ ఇద్దరినీ ముప్పతిప్పలు పెట్టే ప్రమాదకరమైన సైబర్ క్రిమినల్ పాత్రలో నటుడు విక్రాంత్ మాస్సే కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. దర్శకుడు అవినాష్ అరుణ్ తెరకెక్కించిన ఈ సిరీస్‌ను రాజ్‌కుమార్ హిరాణీ క్రియేటర్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తూ ఓటీటీ ప్రపంచంలోకి అడుగుపెడుతున్నారు.



# 'భ్రమయుగం' దర్శకుడితో పృథ్వీరాజ్ కొత్త చిత్రం.. నిర్మాతగా కరణ్ జోహార్!

ప్రముఖ బాలీవుడ్ నిర్మాత, దర్శకుడు కరణ్ జోహార్ మలయాళ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. ఆయనకు చెందిన ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ 'ధర్మ ప్రొడక్షన్స్' నిర్మిస్తున్న మొదటి మలయాళ చిత్రాన్ని మంగళవారం అధికారికంగా ప్రకటించారు. రాహుల్ సదాశివన్ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'ఒడియన్: ది ఏజ్ ఆఫ్ ఇల్యూజన్' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమాలో మాలీవుడ్ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్, సీనియర్ నటి మంజు వారియర్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. కేరళ జానపద కథల్లోని ఒక రూపాన్ని మార్చే శక్తులున్న వ్యక్తి, ఒక శక్తివంతమైన మాతృస్వామ్య కుటుంబంపై పగ తీర్చుకునే నేపథ్యంలో, నిజానికి భ్రమకు మధ్య జరిగే పోరాటంగా ఈ చిత్రం రూపొందనుంది. ధర్మ ప్రొడక్షన్స్ మరియు పృథ్వీరాజ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాను మలయాళంతో పాటు హిందీ, తెలుగు, కన్నడ, తమిళ భాషల్లో పాన్-ఇండియా లెవెల్లో భారీగా విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. అయితే ఈ ప్రాజెక్ట్‌ను ప్రకటిస్తూ సోషల్ మీడియాలో పోస్టర్‌ను పంచుకున్న కరణ్ జోహార్, మలయాళ సినిమా రంగంలోకి అడుగుపెట్టడం గర్వంగా ఉందన్నారు. పృథ్వీరాజ్‌తో కలిసి మరిన్ని ప్రాజెక్ట్స్ చేయబోతున్నామని, దర్శకుడు రాహుల్ సదాశివన్ జానపద కథలను వెన్నులో వణుకు పుట్టించేలా తెరకెక్కించడంలో దిట్ట అని కొనియాడారు. 'భూతకాలం', 'భ్రమయుగం', 'డైస్ ఇరై' వంటి మైండ్ బెండింగ్ హారర్ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న రాహుల్ సదాశివన్‌కు ఇది కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన చిత్రమని చెప్పవచ్చు.

# 'కల్కి 2' లో ఆలియా భట్.. సైలెంట్‌గా షూటింగ్ కూడా పూర్తి చేసిన బాలీవుడ్ బ్యూటీ?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, డైరెక్టర్ నాగ్ అశ్విన్ కాంబినేషన్‌లో వచ్చిన సైన్స్ ఫిక్షన్ వండర్ 'కల్కి 2898 ఏడి' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభంజనం సృష్టించిందో అందరికీ తెలిసిందే. పురాణాల నేపథ్యంతో తెరకెక్కిన ఈ విజువల్ వండర్‌కు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ వంటి దిగ్గజాల నటన ఈ సినిమాను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లింది. ప్రస్తుతం ఈ భారీ బ్లాక్‌బస్టర్ సీక్వెల్ 'కల్కి-2' కూడా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఈ క్రమంలోనే 'కల్కి' ఫ్రాంచైజీ నుంచి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ సీక్వెల్‌లో బాలీవుడ్ స్టార్ బ్యూటీ ఆలియా భట్ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు సినీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. గతంలో మొదటి భాగంలో నటించిన దీపికా పదుకొనె కొన్ని కారణాల వల్ల ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకున్న సంగతి తెలిసిందే. అయితే, ఆలియా భట్ దీపికా పోషించిన 'సుమతి' పాత్రను చేయడం లేదని తెలుస్తుంది. ఈ సినిమాలో వచ్చే ఒక పవర్‌ఫుల్ స్పెషల్ రోల్‌లో ఆమె కనిపించనున్నట్లు సమాచారం. మరింత షాకింగ్ విషయమేమిటంటే.. ఆలియా భట్ ఇప్పటికే తన పాత్రకు సంబంధించిన కొంతమేర షూటింగ్‌ను కూడా సైలెంట్‌గా పూర్తి చేసిందని టాక్. 'ఆర్ఆర్ఆర్' చిత్రంతో ఇప్పటికే తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరైన ఆలియా.. ఇప్పుడు ఈ క్రేజీ సైన్స్ ఫిక్షన్ సీక్వెల్‌లో భాగం కావడం సినిమాపై అంచనాలను మరింత పెంచేస్తోంది. ఈ అలియా ఎంట్రీపై త్వరలోనే వైజయంతీ మూవీస్ టీమ్ నుండి అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.



PRINTED AND PUBLISHED BY KANUGULA SRINIVAS ON BEHALF OF VIPLAV MEDIA PUBLICATIONS. AT M/S SMIL YS ONLINE H.NO : 6-7-48 VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY DIST, TELANGANA - 500 O70 AND PUBLISHED AT VIPLAV MEDIA PUBLICATIONS. H.NO : 18-7-496 KANDIKAL GATE, UPPUGUDA, HYDERABAD, TELANGANA - 500 053. CEO & CHIEF EDITOR VANGA NAGARAJ REDDY (RAJU), EDITOR VANGA VIPLAV TEJA. PRGI : TGBIL/26/A2289. PHONE NO: +9184990 94183, +9193945 17061